పరీక్షలకు హాజరయిన విద్యార్థులు

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- ప్రశాంతంగా పరీక్షల నిర్వహణ
- 22,406 మంది విద్యార్థులు హాజరు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జిల్లావ్యాప్తంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు పరీక్షలు రాశారు. ఈ పరీక్ష నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. ఈ పరీక్షకు మొత్తం 23,120 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 22,406 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పరీక్షకు 714 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఈ సందర్భంగా సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌తో పాటు ఆర్ఐఒ గురువయ్య శెట్టి బృందాలతో పలు పరీక్ష కేంద్రాల్లో పరీక్ష నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎక్కడ ఎలాంటి చిన్న సంఘటనలు కూడా చోటు చేసుకోకుండా పరీక్షలను నిర్వహించామన్నారు. మాల్ ప్రాక్టీసింగ్ కేసులు ఎక్కడా నమోదు కాలేదని తెలిపారు.

భానుడి భగభగలు

- 38 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రత - వేసవి తాపానికి అల్లాడుతున్న ప్రజలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

జిల్లాలో భానుడు భగభగలాడుతున్నాడు. జిల్లాలో అత్యధికంగా 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మార్చి ఆరంభంలోనే వేసవి తాపానికి ప్రజలు అల్లాడుతున్నారు. ఎండను దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు...

ఫిబ్రవరి రెండో వారం నుంచి భగభగలాడుతున్న సూర్యుడు మార్చి ఆరంభం నాటికి తన ప్రతాపాన్ని పెంచేశాడు. గత వారం రోజుల నుంచి ఎండ తీవ్రరూపం దాల్చింది. పగటి పూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. కర్నూలు జిల్లాలో గతేడాది ఇదే సమయానికి పగటి పూట అత్యధికంగా 36 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కాగా ఈ ఏడాది 38 డిగ్రీలకు చేరుకుంది. కర్నూలు నగరంలో శుక్రవారం అత్యధికంగా 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరు, ఆలూరులో 37 డిగ్రీలు, పత్తికొండలో 36 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అత్యధిక ఉష్ణోగ్రత వల్ల ఎండ సెగ తీవ్ర స్థాయిలో కనిపించింది. ఎండ ధాటికి తట్టుకోలేక నగరంలో మధ్యాహ్నం పూట రోడ్ల మీద జన సంచారం పలుచబడింది. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ రోడ్ల మీద జనం చాలా తక్కువగా కనిపించారు. అత్యవసర పనుల విషయంలో మినహాయించి మిగతా సందర్భాల్లో రోడ్ల మీదకు వచ్చేందుకు జనం జంకే పరిస్థితి ఏర్పడింది. కర్నూలు నగరంలోని రాజ్ విహార్ కూడలి, కలెక్టరేట్, బళ్లారి చౌరస్తా, కొత్త బస్టాండ్ ప్రాంతం, కొండారెడ్డి బురుజు ప్రాంతాలు మధ్యాహ్నం పూట నిర్మానుష్యంగా కనిపించాయి. అవసరమై రోడ్ల మీద తిరిగేవారు ఎక్కువగా చెట్ల నీడను ఆశ్రయిస్తూ కనిపిస్తున్నారు.

ఎక్కువ ప్రమాదం ఎవరికంటే..

ఎండ సమయంలో బయట ఎక్కువగా తిరగడం వల్ల పిల్లల్లో ఎక్కువగా వడదెబ్బ తగిలే అవకాశం ఉందని వైద్యులు అంటున్నారు. చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, క్రీడాకారులు, బాలింతలపై ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. దీర్ఘకాలిక వ్యాధులు, స్థూలకాయం ఉన్నవారు, మద్యం ఎక్కువగా తీసుకునే వారు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.

జాగ్రత్తలు తప్పవంటున్న నిపుణులు

ప్రజలు బయట తిరిగే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు, వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వడదెబ్బ వంటివి తగలకుండా నీటిని ఎక్కువగా తీసుకుంటూ సాధ్యమైనంత వరకూ నీడలో ఉండాలని సూచిస్తున్నారు. వడదెబ్బ తగిలిన తరువాత మళ్లీ ఎండలోకి వెళ్లకూడదని, చల్లని నీడలో విశ్రాంతి తీసుకోవాలని అంటున్నారు. బయట తిరిగే సమయంలో తలకు టోపీ పెట్టుకోవాలని, గొడుగు వాడాలని, రోజుకు ఐదు లీటర్లకు తగ్గకుండా

నీరు తాగాలని, సమయానికి ఆహారం తీసుకోవాలని, ఉప్పు కలిపిన ద్రవాలు తాగాలని, శరీరంలో నీటి శాతాన్ని పెంచుకునేందుకు పుచ్చకాయ, కొబ్బరి నీళ్లు తాగాలని, వదులైన కాటన్ దుస్తులు ధరించాలని సూచిస్తున్నారు.

మిమ్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

విజయనగరం జిల్లా నెల్లిమర్లలోని మహారాజా మెడికల్ సైన్సెస్ వైద్య కళాశాలలోని కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు డిమాండ్ చేశారు. మిమ్స్ వైద్య కళాశాల కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం కలెక్టరేట్ ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. సిఐటియు ఓల్డ్ సిటీ కార్యదర్శి విజయ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడారు. విజయనగరం జిల్లా నెల్లిమర్లలోని మిమ్స్ వైద్య కళాశాలలో పని చేస్తున్న కార్మికులు సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేస్తుంటే నాయకులను తొలగించారని తెలిపారు. వారిని వెంటనే పనిలోకి తీసుకోవాలని కార్మికులందరూ ఆందోళన చేస్తుంటే వారిపైన విచక్షణారహితంగా దాడులు చేసి, పోలీసు కేసులు బనాయించడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. మిమ్స్ వైద్య కళాశాల యాజమాన్యం తన మొండి వైఖరిని విడనాడి వెంటనే కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న ఏడు డిఎలను వెంటనే చెల్లించాలని, తొలగించిన కార్మికులందరినీ విధుల్లోకి తీసుకోవాలని కోరారు. సిఐటియు ఓర్వకల్లు మండల అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్, షాజహాన్, సిఐటియు నగర నాయకులు ఏసు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నాలో మాట్లాడుతున్న అంజిబాబు

టమోటా రైతులను ఆదుకుంటాం

- ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి
- టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌కు భూమి పూజ

ప్రజాశక్తి - పత్తికొండ

టమోటా రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి తెలిపారు. శుక్రవారం పత్తికొండలో సర్వే నెంబర్ 286లో మూడెకరాల భూమిలో రూ.12 కోట్లతో టమోటా ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణానికి ఎమ్మెల్యే శ్రీదేవి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల రైతులు ఎంతో నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ఎన్నో ఏళ్ల నాటి కల అని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి అడిగిన వెంటనే టమోటా రైతులను ఆదుకోవడానికి టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌కు నిధులు మంజూరు చేశారని తెలిపారు. డిసెంబర్ చివరి నాటికి రైతులకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. రెండోసారి ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డిని, ఎమ్మెల్యేగా తనను ఆశీర్వదించి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎంపిపి నారాయణదాసు, ఎఫ్‌టిఒ పీడీ ఉమాదేవి, జడ్‌పిటిసి ఉరుకుందమ్మ, ఎఫ్‌టిఒ ఛైర్మన్ బనగాని శ్రీనివాస్, ఎంపిటిసిలు నెట్టెకల్లు, కేశప్ప, మండల కన్వీనర్ కారం నాగరాజు, సచివాలయాల కన్వీనర్ బళ్లారి మోహన్ కృష్ణ, తహశీల్దార్ మాధవరావు, తిరుమల కన్‌స్ట్రక్షన్ కంపెనీ అధినేత సిద్ధార్థ రెడ్డి, ఫణేందర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీదేవి

పోలింగ్ కేంద్రాల మార్పు, చేర్పులపై ప్రతిపాదనలు

- కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

పోలింగ్ కేంద్రాల పేరు, లొకేషన్ మార్పు, యాగ్జిలరీ పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ప్రతిపాదనలను సిఇఒకు పంపుతున్నామని కలెక్టర్ డాక్టర్ జి.సృజన రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు తదితర అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అన్ని టీములు ఏర్పాటు చేసి, శిక్షణ కూడా ఇచ్చామని వివరించారు. నోటిఫికేషన్ వచ్చిన 3 రోజులకు పోలింగ్ కేంద్రాల్లో వల్నరబిలిటీ మ్యాపింగ్ ఎన్నికల కమిషన్‌కు సమర్పించాల్సి ఉన్నందున ఈ ప్రక్రియను కూడా చేస్తున్నామని తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించిన తర్వాత తొలగింపుల ప్రక్రియ ఉండదని స్పష్టం చేశారు. సీజనల్‌గా మైగ్రేషన్ వెళ్తూ మళ్లీ వచ్చేవారిని ఓటర్ జాబితా నుంచి తొలగించడం లేదన్నారు. డిఆర్ఒ కె.మధుసూదన్ రావు, బిజెపి ప్రతినిధి సాయి ప్రదీప్, ఇండియన్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి జాన్ విల్సన్, టిడిపి ప్రతినిధి రాజు, బీఎస్పీ ప్రతినిధి అరుణ్ కుమార్, సిపిఎం ప్రతినిధి రాజశేఖర్, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ మురళీ పాల్గొన్నారు.

ఒపిఎస్‌ను పునరుద్ధరిస్తారా..?

గద్దె దిగిపోతారా..?

- యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు - గోనెగండ్లలో 'ఓట్ ఫర్ ఒపిఎస్'

ప్రజాశక్తి - గోనెగండ్ల

రాష్ట్రంలో 11 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు లబ్ధి చేకూర్చే ఒపిఎస్‌ను పునరుద్ధరిస్తారా..? లేదంటే అధికారంలో నుంచి గద్దె దిగిపోతారా అని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శుక్రవారం గోనెగండ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో 'ఓట్ ఫర్ ఒపిఎస్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత 2019 ఎన్నికల ముందు నిర్వహించిన పాదయాత్రలో ఇప్పటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఒపిఎస్‌ను అమల్లోకి తెస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అధికారంలోకి వచ్చి ఐదేళ్లు గడిచినా ఒపిఎస్‌ను పునరుద్ధరించలేదని చెప్పారు. ఇప్పుడు ఆర్థిక కారణాల సాకు చూపి జిపిఎస్, సిపిఎస్ ప్రత్యామ్నాయ విధానాలను సూచించడం మోసం చేయడమేనని విమర్శించారు. గత జనవరి 28న రాజమండ్రిలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులతో సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలూ ఒపిఎస్‌ను పునరుద్ధరిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించే విధంగా ఒత్తిడి తీసుకురావాలని నిర్ణయించామని చెప్పారు. అందులో భాగంగానే కర్నూలు జిల్లాలో 'ఓట్ ఫర్ ఒపిఎస్' ప్రచార కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఎవరైతే ఒపిఎస్‌ను అమలు చేస్తామని స్పష్టంగా ప్రకటిస్తారో వారికే ఓటు వేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయులకు సూచించారు. ఎస్‌టియు నాయకులు తిమ్మన్న, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రవికుమార్, సహాధ్యక్షులు హేమంత్ కుమార్, నాయకులు యెహోషువా, నరసింహులు, ఎల్లప్ప, గుమ్మలబాబు, చంద్రపాల్, మద్దిలేటి, రామన్, లింగన్న, సలీం, నాగేశ్వర రావు, అక్బర్, రాముడు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు

కర్నూలు వైసిపి సమన్వయకర్తగా ఇంతియాజ్

ప్రజాశక్తి - కర్నూలు క్రైం

కర్నూలు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్తగా రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఎఎండి. ఇంతియాజ్ అహ్మద్‌ను నియమించారు. వైసిపి సమన్వయకర్తల 9వ జాబితాను శుక్రవారం విడుదల చేశారు. అందులో కర్నూలు సమన్వయ కర్తగా ఇంతియాజ్‌ను నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంతియాజ్ అహ్మద్ సొంత ఊరు కోడుమూరు. ఆయన డిప్యూటీ కలెక్టర్‌గా విధుల్లో చేరి పలు కీలక ఉద్యోగాల్లో పని చేశారు. మొన్నటి వరకు మైనార్టీ శాఖ కమిషనర్, సిసిఎల్ఎ కార్యదర్శిగా ఉన్న ఆయన వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నారు. రిటైర్మెంట్‌కు దరఖాస్తు చేసిన రోజు సాయంత్రానికే ప్రభుత్వం ఆయన రాజీనామాను ఆమోదించింది. మరుసటి రోజు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సమక్షంలో ఆయన వైసిపిలో చేరిన విషయం తెలిసిందే.

బజాజ్ ఆటో క్రెడిట్‌గా ఆటో ఫైనాన్స్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

బజాజ్ ఆటో ఫైనాన్స్ లిమిటెడ్ ఇప్పుడు బజాజ్ ఆటో క్రెడిట్‌గా మారిందని భారత్ బజాజ్ షోరూమ్ ఎండి ఎస్.వసీం పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బంగారు పేటలోని భారత్ బజాజ్ షోరూంలో బజాజ్ ఆటో ఫైనాన్స్ లిమిటెడ్ బజాజ్ ఆటో క్రెడిట్ అయినా సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బజాజ్ ఆటో ఫైనాన్స్ ఆటో క్రెడిట్‌గా మారడం సంతోషంగా ఉందన్నారు. బాజబ్ కంపెనీ ఏరియా సేల్స్ మేనేజర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ బజాజ్ ఆటో లిమిటెడ్ అనేది 1945న హమారా బజాజ్ అనే టాగ్‌లైన్‌తో ప్రారంభమైందని, యజమాని రాజీవ్ బజాజ్ అని, 70 దేశాలకు బజాజ్ వాహనాలు ఎక్స్‌పోర్ట్ చేస్తున్నారని తెలిపారు. ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద తయారీదారులని, భారతదేశంలో రెండో అతిపెద్ద తయారీదారులని చెప్పారు. కార్యక్రమంలో సబ్ డీలర్లు నందికొట్కూరు రంగస్వామి, పత్తికొండ రాము, వెల్దుర్తి శ్రీకాంత్, కోడుమూరు శ్రీనివాస్, భారత్ బజాజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న ఎండి ఎస్.వసీం తదితరులు

అబ్దుల్ కలాం పాఠశాల నిర్మాణ పనులు చేపట్టాలి

- పట్టణ పౌర సంక్షేమ సంఘం, ఎస్ఎఫ్ఐ డిమాండ్
- కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కర్నూల్ నగరంలోని డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం పాఠశాల భవన నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు పుల్లారెడ్డి, ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్ష కార్యదర్శులు అమర్, సాయి డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట పట్టణ పౌర సంక్షేమ సంఘం, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ ధర్నా కార్యక్రమానికి ఎం.నాగరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 46వ వార్డు నరసింహారెడ్డి నగర్ పంప్ హౌస్‌లో రూ. 2 కోట్లతో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం మెమోరియల్ హైస్కూల్ భవన నిర్మాణానికి 2021 నవంబర్‌లో నలుగురు మంత్రులు, ముగ్గురు ఎంపీలు, ఎమ్మెల్యేలు శంకుస్థాపన చేశారన్నారు. ఇంతవరకు భవనం నిర్మాణం పూర్తికానందున దొంగలకు నిలయంగా మారిందన్నారు. నాడు-నేడుకు కోట్లు ఖర్చు చేస్తూ స్కూల్ భవనాలు నిర్మిస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నామని గొప్పగా చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి అబ్దుల్ కలాం మెమోరియల్ హై స్కూల్ భవనాన్ని ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. అశోక్ నగర్ పంప్ హౌస్‌లో వ్యాపార సముదాయ భవనాలను 4 నెలల్లో పూర్తి చేసిన అధికారులు, ప్రజాప్రతినిధులు అబ్దుల్ కలాం పేరుపై ఉన్న హైస్కూల్ భవనాన్ని ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. వెంటనే పాఠశాల నిర్మాణ పనులను చేపట్టాలని డిమాండ్ చేశారు. హైస్కూల్ అందుబాటులో లేక దూర ప్రాంతాలకు పిల్లలను పంపలేక తల్లిదండ్రులు ఇబ్బంది పడుతున్నారని ఎస్.అన్వర్ బాషా ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ధర్నాలో పట్టణ పౌర సంక్షేమ సంఘం నగర నాయకులు వెంకటేశ్వర్లు, మధుసూదన్, శశి కుమార్ రెడ్డి, సివి వర్మ, రమణ గౌడ్, శ్రీనివాసులు, మద్దిలేటి, ఎస్ఎఫ్ఐ నగర నాయకులు మనోహర్, పవన్, శివ తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న నాయకులు

సుందరయ్య జంక్షన్‌లో సర్కిల్ ఏర్పాటు చేయాలి

- డివైఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కర్నూల్ నగరంలోని నడిబొడ్డున నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారిన సుందరయ్య జంక్షన్‌లో సర్కిల్ ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని డివైఎఫ్ఐ, ఐద్వా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ, ఐద్వా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం సుందరయ్య జంక్షన్‌లో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి ఎన్.అలివేలు, డివైఎఫ్ఐ న్యూ సిటీ కార్యదర్శి ఎస్.హుస్సేన్ బాషా మాట్లాడారు. పెరిగిన రద్దీ కారణంగా సుందరయ్య జంక్షన్ నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారిందన్నారు. బస్టాండ్ నుండి వచ్చే వాహనాలు, రాజ్ విహార్ నుండి వెంకటరమణ కాలనీకి వెళ్లే వాహనాలు, వెంకటరమణ కాలనీ నుండి బస్టాండ్‌కు వెళ్లే వాహనాలు ఈ జంక్షన్ దగ్గరకు వచ్చేసరికి సర్కిల్ లేక క్రాసింగ్ సమయంలో ప్రమాదాలకు గురవుతున్నారని చెప్పారు. కొన్ని సందర్భాలలో జంక్షన్‌లో వాహనాలు రాంగ్ రూట్‌లో రావడంతో ట్రాఫిక్ నిలబడి పెద్ద ఎత్తున స్తంభించి పోతుందని అన్నారు. తిరిగి యథాస్థితికి రావడానికి చాలా సమయం పడుతుందని తెలిపారు. నగరపాలక సంస్థ కమిషనర్, అధికారులు వెంటనే స్పందించి ఈ జంక్షన్‌లో సర్కిల్ ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలను కలుపుకొని ఆందోళనను చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకురాలు కె.ఎస్.పద్మ, ఓల్డ్ సిటీ కార్యదర్శి బి.పద్మ, డివైఎఫ్ఐ నగర నాయకులు విక్రమ్, వీరేష్, మహేష్, కిరణ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సంతకాల సేకరణ చేపడుతున్న ఐద్వా, డివైఎఫ్ఐ నాయకులు

జెవిడి ద్వారా రూ 23.95 కోట్లు జమ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా జిల్లా వ్యాప్తంగా అర్హులైన 35,618 మంది విద్యార్థులకు చెందిన 32,250 మంది తల్లుల ఖాతాల్లో రూ.23.95 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం జమ చేసిందని జిల్లా కలెక్టర్ జి.సృజన తెలిపారు. శుక్రవారం జగనన్న విద్యా దీవెన ఫీజు రీయంబర్స్మెంట్ నిధులను సిఎం జగన్మోహన్ రెడ్డి విడుదల చేశారు. జగనన్న విద్యా దీవెన ప్రత్యక్ష ప్రసారాన్ని కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లా కలెక్టర్ జి.సృజన, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సుభాష్ చంద్రబోస్, రాష్ట్ర ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ డి.కల్పన, కటికె కార్పొరేషన్ డైరెక్టర్ కె.గౌతం, సాంఘిక సంక్షేమ శాఖ జెడి రంగలక్ష్మి దేవి, బిసి సంక్షేమ అధికారి వెంకటలక్ష్మి, గిరిజన సంక్షేమ అధికారి శ్రీనివాస కుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొని వీక్షించారు. అనంతరం జిల్లాలో జగనన్న విద్యా దీవెన కింద అక్టోబరు 2023 నుండి డిసెంబరు 2023 త్రైమాసికానికి సంబంధించిన పూర్తి స్థాయి ఫీజు రీయింబర్స్మెంట్ రూ.23.95 కోట్ల మెగా చెక్కును జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధులు విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సత్య నారాయణమ్మ, ఎస్‌టిబిసి కళాశాల ప్రిన్సిపల్ డా.ప్రశాంతి, విద్యార్థులు పాల్గొన్నారు.

మెగా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ తదితరులు

మాట్లాడుతున్న వెంకటరాముడు



'ఉపాధి'ని కాపాడుకోవాలి : వ్యకాసం

ప్రజాశక్తి - గూడూరు

ఉపాధి హామీ చట్టం పేదలకు ఒక వరం లాంటిదని, ఇలాంటి చట్టాన్ని ఐక్యంగా ఉండి కాపాడుకోవాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.వెంకటరాముడు కోరారు. శుక్రవారం గూడూరు మండలం పెంచికలపాడు గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించి కూలీలతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధి కూలీలతో జనరల్ బాడీ సమావేశం నిర్వహించి వ్యవసాయ కార్మిక సంఘం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా కాశమ్మ, తిప్పన్న, ఉపాధ్యక్షులుగా జానకిరాముడు, సహాయ కార్యదర్శిగా రామాంజనేయులు, కోశాధికారిగా ఆదిశేషులు, కమిటీ సభ్యులుగా మాబి, సుంకులమ్మ, మద్దిలేటి, రామ్మోహన్, నడిపి సుంకన్నలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఉపాధి కూలీలు, మేటీలు పాల్గొన్నారు.

మహిళ మెదడులో పెద్ద కణితి

- 14 గంటల పాటు శస్త్రచికిత్స చేసి తొలగించిన కర్నూలు కిమ్స్ వైద్యులు

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్ : మెదడులో పెద్ద బంగాళదుంప సైజు కణితి ఏర్పడటంతో మాట సరిగా రాకపోవడం, తీవ్రమైన తలనొప్పితో బాధపడుతున్న 48 ఏళ్ల మహిళకు కర్నూలు కిమ్స్ వైద్యులు 14 గంటల పాటు శస్త్రచికిత్స చేసి తొలగించారు. శుక్రవారం స్థానిక కిమ్స్ ఆస్పత్రిలో కిమ్స్ కన్సల్టెంట్ న్యూరోసర్జన్ డాక్టర్ సుమంత్ కుమార్ శస్త్ర చికిత్స వివరాలు తెలియజేశారు. 'ఈశ్వరమ్మ మాట బాగా తడబడటంతో పాటు తీవ్రమైన తలనొప్పి వచ్చి ఇబ్బంది పడ్డారు. వైద్య పరీక్షలు చేసిన తర్వాత, ఆమెకు ఎడమవైపు టెంపొరల్ స్కల్ బేస్ ప్రాంతంలో అత్యంత భారీ కణితి ఏర్పడినట్లు గుర్తించారు. శస్త్రచికిత్స చేసిన తర్వాత కూడా మాట, జ్ఞాపకశక్తి తిరిగి వస్తాయా లేదా అన్న విషయం కచ్చితంగా చెప్పలేకపోవడంతో పాటు మరింత ఇబ్బంది తలెత్తే ప్రమాదం కూడా ఉంటుంది. కర్నూలు కిమ్స్ ఆస్పత్రిలో అత్యాధునిక వైద్య సదుపాయాలు ఉండటం, నిపుణులైన వైద్య బృందం కూడా ఉండటంతో శస్త్రచికిత్స చేపట్టాలని నిర్ణయించారు. కణితి బాగా పెద్దగా ఉండటంతో మొత్తం తొలగించడానికి 14 గంటల సమయం పట్టింది. కణితిని తొలగించడంతో పాటు అదే సమయంలో ఆమె జ్ఞాపకశక్తి, ఇతర సామర్థ్యాలు దెబ్బతినకుండా ఉండేందుకు అత్యంత జాగ్రత్తగా చేశారు. ఆమె ఎలాంటి ఇబ్బంది లేకుండా పూర్తిస్థాయిలో సాధారణ స్థితికి చేరుకున్నారు' అనిడాక్టర్ సుమంత్ కుమార్ తెలిపారు.

కణితిని తొలగించిన తర్వాత రోగితో డాక్టర్ సుమంత్ కుమార్

పరీక్షలు రాసేందుకు సిద్ధంగా ఉన్న విద్యార్థులు

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పట్టణంలో ఇంటర్ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు జరిగాయి. పట్టణంలోని ఆర్ట్స్ కళాశాల, ప్రభుత్వ గర్ల్స్ కళాశాల, అక్షరశ్రీ కళాశాల, బాలాజీ కళాశాల, నారాయణ కళాశాల, సాయి కళాశాలలో పరీక్షలు నిర్వహించారు. ఏడు కేంద్రాల్లో మొత్తం 2589 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 82 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. ఆర్ట్స్ కళాశాలలోని 'ఎ' సెంటర్‌లో 15, 'బి' సెంటర్‌లో 9, బాలాజీ కళాశాలలో 9, సాయి కళాశాలలో 12, అక్షరశ్రీ కళాశాలలో 15, నారాయణ కళాశాలలో 13, ప్రభుత్వ బాలికల కళాశాలలో 9 మంది విద్యార్థులు గైర్హాజరయినట్లు ఆయా కళాశాలల సూపరింటెండెంట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల దగ్గర పోలీసు బందోబస్తు, మెడికల్ సిబ్బందిని ఏర్పాటు చేశారు. పరీక్షకు ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదని ముందుగానే బోర్డు అధికారులు తెలియజేయడంతో విద్యార్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకున్నారు. మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగింది.

వంటలు రుచిగా ఉండాలి

- సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ

ప్రజాశక్తి - ఆదోని

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

పౌష్టికాహార పదార్థాలతో పాటు వంటకాలను రుచికరంగా వండాలని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ సూచించారు. శుక్రవారం ఆదోనిలోని క్రాంతి నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కస్తూరిబా గాంధీ బాలికల వసతి గృహంలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని సబ్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం తప్పకుండా విద్యార్థులకు అందించాలన్నారు. భోజనం చాలా బాగుందని పాఠశాల ప్రధానోపాధ్యాయులను అభినందించారు. అనంతరం పాఠశాలలో ప్రతి తరగతి గదికీ తిరిగి ఉపాధ్యాయులు పిల్లలకు చెబుతున్న బోధనలను గమనించారు. చిన్నారులతో సబ్ కలెక్టర్ పాఠ్యపుస్తకాల నుంచి ప్రశ్నలు అడిగి వారి నైపుణ్యాలను గమనించారు. ప్రభుత్వ అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు.

రిజిస్ట్రేషన్ పత్రాలతో సంపూర్ణ హక్కు

- టిటిడి పాలకమండలి సభ్యులు సీతారామిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

పత్రాలను అందజేస్తున్న సీతారామిరెడ్డి

జగనన్న ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీతో లబ్ధిదారులకు ఇంటి స్థలాలపై సంపూర్ణ హక్కులు కల్పించినట్లు వైసిపి రాష్ట్ర నాయకులు, టిటిడి పాలకమండలి సభ్యులు వై.సీతారామిరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైసిపి ప్రభుత్వ పాలనలో నవరత్నాల్లో భాగంగా ఇంటి స్థలాలు లేని నిరుపేదలకు ఎకరా రూ.25 లక్షల చొప్పున 16 ఎకరాలు కొనుగోలు చేసి ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం సుమారు 545 ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలు అందించారు. ప్రతి లబ్ధిదారుల నుంచి తంబ్ వేయించి ధ్రువీకరణతో ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. వీటి ద్వారా బ్యాంకు రుణాలు పొంది చిరు వ్యాపారాలు చేసుకోవచ్చని, తెలిపారు. అవసరమైతే అమ్ముకునే అధికారం కూడా లబ్ధిదారులకు జగనన్న ఇచ్చారని చెప్పారు. అనేక సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని రానున్న ఎన్నికల్లో గెలిపించుకోవాలని, ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డిని కూడా నాలుగోసారి గెలిపించాలని కోరారు. వైసిపి మండల ఇన్‌ఛార్జి విశ్వనాథ్ రెడ్డి, సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, వైస్ ఎంపిపి పులికుక్క రాఘవేంద్ర, వ్యవసాయ సలహా మండలి సభ్యులు కురువ మల్లికార్జున, మాజీ ఉప సర్పంచి గోర్కల్ కృష్ణస్వామి, నాయకులు జనార్ధన్ రెడ్డి, శివకుమార్, బొంబాయి శివ, జగదీష్ స్వామి, ఎంపిడిఒ మునెప్ప, డిప్యూటీ తహశీల్దార్ రాఘవేంద్ర, ఎస్ఐ గోపినాథ్, విశ్రాంత ఎఎస్ఒ నాగభూషణ్ రావు, విఆర్ఒ భీమనగౌడు పాల్గొన్నారు.

ఒపిఎస్‌ను అమలు చేయాలి

- యుటిఎఫ్ నాయకులు దావీద్
- 'ఓట్ ఫర్ ఒపిఎస్' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని యుటిఎఫ్ జిల్లా, రాష్ట్ర నాయకులు ఎస్.దావీద్, జె.ఎల్లప్ప, ఎం.నరసింహులు కోరారు. శుక్రవారం యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ తయారు చేసిన 'ఓట్ ఫర్ ఒపిఎస్' పుస్తకాన్ని స్థానిక యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో యుటిఎఫ్ నాయకులతో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ యుటిఎఫ్ చేస్తున్న దశలవారీ పోరాటాల్లో భాగంగా 'ఓట్ ఫర్ ఒపిఎస్' పేరుతో ఒక బుక్‌లెట్ తయారు చేసిందని తెలిపారు. ఇందులో సిపిఎస్ విధానం నేపథ్యం, సిపిఎస్ విధానంతో ఉద్యోగులకు వచ్చేదెంత..?, ఉద్యోగులకు సంతృప్తి ఇవ్వలేకపోవడానికి కారణాలు ఏమిటి? వివిధ రాష్ట్రాల్లో ప్రస్తుత పరిస్థితులు, కేంద్ర ప్రభుత్వ వైఖరి, ఆంధ్రప్రదేశ్ పరిణామాలు, జిపిఎస్ తదితర అంశాలపై అవగాహన కల్పించేందుకు పుస్తకాన్ని రూపొందించినట్లు చెప్పారు. పుస్తకాన్ని చదివి మన భవిష్యత్తు, భావితరాల భవిష్యత్తు కోసం, మనం ఏ రాజకీయ పార్టీకీ ఓటు వేయాలో నిర్ణయించుకోవాలని కోరారు. యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు డి.కౌలన్న, వై.రామాంజినేయులు, వివిధ మండలాల నాయకులు మల్లారి నాగరాజు, ఎం.రాజు, చంద్రపాల్, ప్రసాద్, గురుస్వామి, శివకుమార్, రంగన్న, విజయ్ కుమార్, జి.బాబు, భాగ్యరాజు, నాగేశ్వరరావు, భాస్కర్ పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

రామచంద్రారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అనుపమ

మున్సిపల్ కమిషనర్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని మున్సిపల్ కమిషనర్‌గా రామచంద్రారెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ బాధ్యతలు నిర్వర్తించిన మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి ప్రొద్దుటూరుకు బదిలీ అయ్యారు. బాపట్ల మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న రామచంద్రారెడ్డిని ఆదోని మున్సిపల్ కమిషనర్‌గా ప్రభుత్వం నియమించింది. కార్యాలయంలోని ఆయన ఛాంబర్‌లో మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి మాట్లాడారు. ఆదోని పురవాసులకు అందుబాటులో ఉంటామని, సమస్యలుంటే తనను సంప్రదించాలని కోరారు.

ఈనెల 31లోపు పన్ను చెల్లిస్తే వడ్డీ రాయితీ

మున్సిపాలిటీ పరిధిలోని ఆస్తి, ఖాళీ స్థలం పన్నులు ఈనెల 31లోపు చెల్లించి వడ్డీ మినహాయింపు పొందాలని నూతన కమిషనర్ రామచంద్రా రెడ్డి తెలిపారు. ఆస్తి పన్ను చెల్లింపుదారులు వన్ టైమ్ సెటిల్‌మెంట్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పురపాలక అభివృద్ధి కోసం పన్నులు సకాలంలో చెల్లించి భాగస్వాములు కావాలని తెలిపారు. రెవెన్యూ ఆఫీసర్ అస్లాం బాష, మేస్త్రి మహబూబ్ బాషా ఉన్నారు.

దేవాలయాలు ప్రశాంతతకు నిలయాలు

- వైసిపి రాష్ట్ర యువ నాయకులు ప్రదీప్ రెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం

గ్రామాల్లో దేవాలయాలు ప్రశాంతతకు నిలయాలని వైసిపి రాష్ట్ర యువ నాయకులు వై.ప్రదీప్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని రౌడూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన మారెమ్మ గుడిని ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవాలయంలో పూజలు నిర్వహించి మాట్లాడారు. గ్రామస్తులు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఈ ఏడాది మంచి పంటలు పండాలని ఆకాంక్షించారు. గ్రామ నాయకులు పాండురంగ రెడ్డి, సోమిరెడ్డి తదితరులు స్వాగతం పలికి పూలమాలలతో సన్మానించారు. టిడిపి నాయకులు దివాకర్ రెడ్డి, చెన్న బసప్ప, వెంకటపతి రాజు, దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ అభివృద్ధికి రూ.50 వేల విరాళం అందజేశారు.

పూజలు చేస్తున్న ప్రదీప్ రెడ్డి

బండలాగుడు పోటీల్లో విజేత యుఎస్ఆర్ బుల్స్

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని కొత్తపేట శుక్రవారం నిర్వహించిన అంతర్ రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీల్లో ఒంగోలు జిల్లాకు చెందిన గంగన్న పాలెం గ్రామానికి చెందిన యుఎస్ఆర్ బుల్స్ వృషభాలు విజేతగా నిలిచాయి. రెండో స్థానంలో నాగర్ కర్నూలు జిల్లా రాయవరం అనన్య రెడ్డి వృషభాలు, మూడవ స్థానంలో నంద్యాల జిల్లా పగిడ్యాల గ్రామానికి చెందిన కోరల గిరిజ, నాలుగో స్థానంలో కర్నూలు జిల్లా యనగండ్ల గ్రామానికి చెందిన జానకి రాముడు వృషభాలు, ఐదో స్థానంలో డిజె.బుల్స్, కౌశిక్ కుమార్ పుచ్చకాయల మడ వృషభాలు, ఆరో స్థానంలో పులికొండ గ్రామానికి చెందిన రంగస్వామి వృషభాలు, గార్లపాడు, కులుమాల గ్రామానికి చెందిన రామాంజనేయులు వృషభాలు, ఏడో స్థానంలో సి.బెళగల్ మండలం యనగండ్ల గ్రామానికి చెందిన వేణుగోపాల్ వృషభాలు నిలిచాయి. విజేతలకు నిర్వాహకులు, బహుమతి దాతలు ఖాదర్ బాషా, మస్తాన్‌వలీ, తిక్కయ్య, వెంకప్ప గౌడ్, వాలంటీర్లు రంగముని, మహబూబ్ బాషా, మస్తాన్‌వలీ బహుమతులు ప్రదానం చేశారు. సర్పంచి కుమారుడు బాబు, నిర్వాహకులు, గ్రామస్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

కార్యకర్తల మృతి పార్టీకి తీరని లోటు

- మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం
- టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తిక్కారెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

టిడిపి కార్యకర్తల అకాల మృతి పార్టీకి తీరని లోటని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పాలకుర్తి తిక్కారెడ్డి తెలిపారు. శుక్రవారం మృతదేహాలను సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోసిగిలోని సీనియర్ నాయకులు కోతుల తిక్కస్వామి, మంత్రాలయం మండలం మాధవరం గ్రామంలో మఠం చెన్నయ్య స్వామి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న తిక్కారెడ్డి ఆయా గ్రామాలకు చేరుకుని మృతదేహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. రెండు కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఇందులో భాగంగా మట్టి ఖర్చులకు ఆర్థిక సహాయం అందజేశారు. టిడిపి మండల నాయకులు కృష్ణ మోహన్ రెడ్డి, మారెప్ప ఉన్నారు.

మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న తిక్కారెడ్డి

సంక్షేమ పథకాలతో ప్రజలకు లబ్ధి

- మాజీ ఎమ్మెల్యే బీవీ, ఎమ్మెల్సీ బిటి.నాయుడు
- బీవీ నాయకత్వంలో భారీ ర్యాలీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

టిడిపి మేనిఫెస్టోలో చేర్చిన సూపర్ సిక్స్ పేరుతో ఆరు సంక్షేమ పథకాలు ప్రజలకు ఎంతో లబ్ధి చేకూరుతుందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ, టిడిపి జిల్లా అధ్యక్షులు బిటి.నాయుడు తెలిపారు. శుక్రవారం నియోజకవర్గంలోని టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు, తెలుగు యువత సభ్యులు, తెలుగు మహిళలు, నందమూరి అభిమానులు, టిఎన్ఎస్ఎఫ్ సభ్యులు, ఐటిడిపి సభ్యులు, బీవీ అభిమానులతో కలిసి పట్టణంలోని సోమప్ప మెమోరియల్ హాలులో సమావేశం నిర్వహించారు. పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ముందుగా పద్మశ్రీ మాచాని సోమప్పకు, టిడిపి వ్యవస్థాపకులు కీర్తిశేషులు ఎన్‌టి.రామారావుకు, కీర్తిశేషులు బీవీ.మోహన్ రెడ్డి చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా టిడిపి, జనసేన ఉమ్మడి ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. పల్లెల్లో, పట్టణాల్లో ప్రజలను చైతన్య పరుస్తూ టిడిపి గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైనికుడిలాగా పని చేయాలని కోరారు. త్వరలో ఎమ్మిగనూరులో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీవీ

అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

శ్రీశైలం భక్తులకు అన్నదానం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్లే భక్తులకు పట్టణంలోని బైపాస్ రోడ్డులో హెచ్‌పి గ్యాస్ గోడౌన్ ఎదురుగా అన్నదానం చేపడుతున్నారు. అల్యూరు మఠం మహర్షి విజయకుమార్ స్వామి, దాతల సహకారంతో గత కొన్ని రోజులుగా అన్నదానం నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. పాదయాత్రగా వెళ్లే భక్తులకు ప్రతేడాది అన్నదానం నిర్వహిస్తున్నామని తెలిపారు. చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని ఆస్పరి గ్రామ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో హాలిగేర గ్రామానికి చెందిన కురువ మహేష్ (20) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. శుక్రవారం మహేష్ మోటార్ సైకిల్‌పై గుంటూరుకు వలస వెళ్తున్న అన్న, వదినను ఆస్పరిలో వదిలి పెట్టారు. తిరుగు ప్రయాణంలో కస్తూరిబా గాంధీ స్కూల్ సమీపంలో పోలీసులు ప్రమాదాల నివారణ కోసం ఏర్పాటు చేసిన డ్రమ్ములను ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయలయ్యాయి. ఆస్పరి ప్రభుత్వాస్పత్రిలో ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆస్పత్రికి తరలిస్తుండగా ఆస్పరి సాయిబాబా గుడి సమీపంలో మృతి చెందారు. మృతునికి 9 నెలల క్రితమే వివాహం జరిగింది. వివాహం జరిగిన సంవత్సరంలోపే మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కురువ వెంకటేష్, కృష్ణమ్మ దంపతులకు పెద్ద కొడుకు గర్జప్ప, చిన్న కొడుకు మహేష్ ఇద్దరు సంతానం. మహేష్ మతి చెందడంతో గ్రామంలోని ప్రజలు కన్నీటి పర్యంతమయ్యారు. సిఐ హనుమంతప్ప కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మృతి చెందిన యువకుడు

ఆన్‌లైన్ మోసాల పట్ల అవగాహన అవసరం

- లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ రామచంద్ర

ప్రజాశక్తి - ఆదోని

ఆన్‌లైన్ ఆర్థిక మోసాల పట్ల విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలని లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ రామచంద్ర సూచించారు. శుక్రవారం ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి ఆదేశాల మేరకు ఆదోనిలో ఆర్‌బిఐ అధికారుల ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ మైదానం నుంచి ఎమ్మిగనూరు టర్నింగ్ వరకు నినాదాలు చేస్తూ ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పొదుపు, ఆర్థిక క్రమశిక్షణ విషయాల్లో అనుభవం గడించాలని విద్యార్థులకు సూచించారు. ఆధునిక యుగంలో టెక్నాలజీ అందుబాటులోకి రావడం మంచిదేనని తెలిపారు. అందుకనుగుణంగానే మోసాలు కూడా పెరిగాయని, ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. నిరక్షరాస్యులకు ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు అల్పాహారాన్ని అందించారు. చీఫ్ మేనేజర్ వీరాంజనేయులు, నెహ్రూ మెమోరియల్ ప్రధానోపాధ్యాయులు అలీమ్ సిద్ధిఖీ, మున్సిపల్ హై స్కూల్ ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు ఫయాజ్, ఉపాధ్యాయులు రామయ్య, సుధాకర్, కల్యాణ్, నిరంజన్, చంద్రమౌళి, కెనరా బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక నిఘా

- తహశీల్దార్ పద్మజ, ఎస్ఐ మహ్మద్ రిజ్వాన్

ప్రజాశక్తి - చిప్పగిరి

సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచుతామని తహశీల్దార్ పద్మజ, ఎస్ఐ మహ్మద్ రిజ్వాన్ తెలిపారు. మండలంలోని 13 పంచాయతీల్లో గతంలో రికార్డుల్లో నమోదయిన సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ పద్మజ, ఎస్ఐ మహ్మద్ రిజ్వాన్ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల వద్ద ఏమైనా సంఘటనలు, ఘర్షణలు జరిగాయా, వాటి వల్ల రీపోలింగ్ జరిగాయా అన్న కోణంలో ప్రతి గ్రామస్తునితో కూడా మమేకమై తెలుసుకొని ఒక నివేదిక ప్రకారం ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తామని తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపులో పోలీసు శాఖ నుంచి ఒకరిని కేటాయిస్తామని చెప్పారు. సెక్టోరియల్ అధికారులకు ఇప్పటి నుంచి గ్రామాల్లో ఏ సమాచారం వచ్చినా ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. సమస్యాత్మక గ్రామాలపై పూర్తి నిఘా ఉంచి సమాచార సేకరణ ఉండేలా చూసుకుంటున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో పోలీసు భద్రత కల్పించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఎంఇఒలు సావిత్రమ్మ, బాలనాయుడు, ఎఒ జయలక్ష్మి, పిఆర్ ఎఇ చోళ రెడ్డి, డిటి అజీజ్ అహ్మద్, ఎఎస్ఐ నజీర్ అహ్మద్ పాల్గొన్నారు.

సమస్యాత్మక కేంద్రాలపై సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

హక్కుల సాధనకు ముస్లింలు గళమెత్తాలి

- ఎంఆర్‌పిఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు మహబూబ్ బాష

ప్రజాశక్తి - ఆదోని

హక్కుల సాధన కోసం ముస్లింలు గళమెత్తాలని ముస్లిం రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం (ఎంఆర్‌పిఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షులు షేక్ మహబూబ్ బాషా కోరారు. పట్టణంలోని షాహి జామియా పెద్ద మసీదు వెనకవైపు మసూదియా ఉన్నత పాఠశాల మైదానంలో గురువారం రాత్రి ముస్లిం గర్జన బహిరంగ సభ జరిగింది. ఈ సభలో డాక్టర్ మహబూబ్ బాష మాట్లాడారు. పెళ్లిళ్ల కోసం ప్రభుత్వాలు అందించే సహాయానికి వధూవరులు కచ్చితంగా పదో తరగతి చదివి ఉండాలని నిబంధన పెట్టడం విడ్డూరంగా తెలిపారు. అదే వధూవరులు ఓటు వేయడానికి ఎలాంటి విద్యార్హత అడగడం లేదని, పెళ్లిళ్ల సహాయం కోసం విద్యార్హత ఎందుకని ప్రశ్నించారు. ఆదోనిలో ఖిద్మత్ సొసైటీ ఆధ్వర్యంలో వడ్డీ లేని రుణాలు ఇవ్వడం హర్షించదగ్గ విషయమని తెలిపారు. ముస్లింల ఓటుతో గద్దెనెక్కుతున్న నేతలు తమకేం చేశారని, తమకు రిజర్వేషన్లు 12 శాతం ఇవ్వాలని తెలంగాణకు చెందిన ప్రముఖ రచయిత్రి సాజిదా సుల్తానా సికిందర్ కోరారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా రాష్ట్రంలో టిక్కెట్ల గోల ఉందని, ఇటీవల ఎమ్మెల్యే టికెట్లు ప్రకటించిన రెండు పెద్ద పార్టీల్లో ముస్లింలకు 118 సీట్లలో ఒక్క టికెట్ మాత్రమే ఇచ్చారని, ఇది చాలా అన్యాయమని ఎంఆర్‌పిఎఫ్ రాష్ట్ర నాయకులు, విశ్రాంత తహశీల్దార్ రోషన్ అలీ తెలిపారు. ఆదోని నియోజకవర్గం ఆరెకల్ వద్ద కోట్లాది రూపాయలతో గత ఐదేళ్ల క్రితం నిర్మించిన విద్యాసంస్థలు ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. ఎంఆర్‌పిఎఫ్‌లో ఎలాంటి రాజకీయం లేదని, కేవలం ముస్లింల హక్కుల కోసమే పోరాడుతున్నామని ఎంఆర్‌పిఎఫ్ రాష్ట్ర యువజన విభాగం నాయకులు సోయబుద్దీన్ ఖాద్రీ పేర్కొన్నారు. ముఖ్యంగా ముస్లింలు విద్యతో పాటు తమ పిల్లలకు నమాజును కూడా విధిగా అలవాటు చేయాలని ఎంఆర్‌పిఎఫ్ జిల్లా ట్రెజర్ ఖాద్రీ సాహెబ్ పేర్కొన్నారు.

అభివాదం చేస్తున్న నాయకులు

ప్రతి పేదకూ అండగా ఉంటాం

- పిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు సుధాకర్ బాబు

ప్రజాశక్తి - దేవనకొండ

సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్ బాబు

ప్రతి పేద కుటుంబానికీ అండగా నిలిచే పార్టీ కాంగ్రెస్ అని పిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు సుధాకర్ బాబు తెలిపారు. శుక్రవారం దేవనకొండ కాంగ్రెస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు మహేంద్ర నాయుడు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా సుధాకర్ బాబు హాజరయి మాట్లాడారు. పేదల సంక్షేమం కోసం ప్రతి పేద కుటుంబానికీ ప్రతి నెలా రూ.5 వేలు ఇస్తామని ఎన్నికల హామీలో భాగంగా సోనియా గాంధీ హామీ ఇచ్చారని తెలిపారు. వైసిపి, టిడిపిలు అవకాశవాద రాజకీయాలు చేస్తున్నాయని, ప్రజల అభివృద్ధి మరచి పదవుల కోసం కొట్లాడడానికే సరిపోయిందని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అవకాశం ఇస్తే ప్రతి గ్రామానికీ హంద్రీనీవా ద్వారా నీరందిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు బజారన్న, మైనారిటీ నగర అధ్యక్షులు ఖాజా, సీనియర్ నాయకులు ఖాసీం, వెంకటేష్, రాఘవేంద్ర, మధు కర్ణ, హుస్సేన్, జావిద్, వెంకీ, భాస్కర్, పరమేష్ పాల్గొన్నారు.

శాశ్వత రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేత

- సర్పంచి అరుణ్ కుమార్

ప్రజాశక్తి - దేవనకొండ

పత్రాలు అందజేస్తున్న సర్పంచి అరుణ్ కుమార్

మండలంలోని తెర్నేకల్ గ్రామ సచివాలయంలో జగనన్న హౌసింగ్ కాలనీలో ఇల్లు కట్టుకున్న లబ్ధిదారులకు శాశ్వత హక్కు కల్పించే విధంగా రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేసినట్లు సర్పంచి అరుణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం సర్పంచి అరుణ్ కుమార్ చేతుల మీదుగా లబ్ధిదారులకు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలో 300 మంది పట్టాలకుగాను మొదటి విడతగా 161 లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేసినట్లు తెలిపారు. ఎంపిపి భర్త లుముంబా, ఎంపిటిసి నామాల శ్రీను, మాజీ ఎంపిటిసిలు ఈరన్న, రాఘవేంద్ర, వార్డు సభ్యులు దొడ్డప్ప, పంచాయతీ కార్యదర్శి రాముడు, విఆర్ఒ మునీర్ బాష, ఇంజినీర్ అసిస్టెంట్ గోపాల్, వైసిపి నాయకులు ఏసేపు, సొలోమోన్ పాల్గొన్నారు.

ఇరుముడితో శివస్వాముల పాదయాత్ర

ఆస్పరి : మండలంలోని బిణిగేరి గ్రామ కొండల్లో కొలువైన శ్రీగిరి క్షేత్రం శివ నామస్మరణతో మార్మోగింది. శుక్రవారం పంచలింగేశ్వర స్వామి ఆలయ నిర్వాహకులు శ్రీనివాస నాయన, రమాదేవి దంపతుల ఆధ్వర్యంలో పదిమంది శివ స్వాములకు ఇరుముడి కట్టారు. సర్పంచి వెంకటేష్, శివ స్వాములు శ్రీనివాసులు, తిక్కయ్య, సూరి, శేఖర్, తిమ్మ, అంజి, వెంకటేష్, భీమన్న పాల్గొన్నారు.

NAME CHANGE
I, SYED THAHERA (Old Name) D/o.SHAIK ABDUL JABBAR, R/o.H.No:76/97-226-5-23, Weaker Section Colony, Kalluru, Kurnool dist-518003, AP., I Have Changed My name to SHAIK THAHERA (New Name) D/o.SHAIK ABDUL JABBAR, for the future purpose.

సిఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు

సీఎం పర్యటన ఏర్పాట్లుపై జిల్లా అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్, ప్రక్కన జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈ నెల 4వ తేదీ బనగానపల్లె పట్టణానికి రానున్న సందర్భంగా పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్ లో సియం పర్యటన ఏర్పాట్లపై జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డిలతో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ పద్మజ, అన్ని శాఖల జిల్లాధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 4వ తేదీ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బనగానపల్లె పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టేందుకు పక్కా ప్రణాళిక రూపొందించుకొని ఆ మేరకు పనులు చేపట్టి సీఎం పర్యటనను సాఫీగా విజయవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రోటోకాల్ ప్రకారం అధికారులకు అప్పగించిన పనులు బాధ్యతాయుతంగా చేపట్టి ఎలాంటి లోపాలు లేకుండా పూర్తి చేయాలన్నారు. హెలిప్యాడ్ ల్యాండ్ అయ్యే ప్రదేశంలో ప్రోటోకాల్ ప్రకారం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి దుమ్ము లేయకుండా వాటరింగ్ పెద్దఎత్తున చేయాలని ఆర్ అండ్ బి, అగ్నిమాపక అధికారులను ఆదేశించారు. విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడంతో పాటు అవసరమైన జనరేటర్లను సిద్ధంగా ఉంచుకోవాలని ఏపీఎస్పిడిసిఎల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. హెలిప్యాడ్, మీటింగ్ సమీపాల్లో ఏర్పాటు చేసిన సేఫ్ రూముల్లో అత్యవసర మందులతో పాటు నిపుణులైన డాక్టర్లు సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని డిఎంహెచ్ఓ, జిల్లా ఆసుపత్రి వైద్యాధికారులను ఆదేశించారు. గ్రీన్ రూమ్, సభా వేదిక, విజిటర్స్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఆహార పదార్థాలలో కల్తీ లేకుండా జాగ్రత్తగా చెక్ చేయాలని ఫుడ్ సేఫ్టీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సభా వేదిక ప్రాంతంలో ప్రాపర్‌గా తాగునీటి వసతి, మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, డిఆర్డిఏ పిడి శ్రీధర్ రెడ్డి, ఆర్టీవో శివారెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, ఆర్డీఓలు మల్లికార్జున రెడ్డి, మహేశ్వర రెడ్డి, మిరియాల దాసు సంబంధిత జిల్లాధికారులు తదితరులు పాల్గొన్నారు.

భానుడి భగభగలు

- 38 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రత
- వేసవి తాపానికి అల్లాడుతున్న ప్రజలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

జిల్లాలో భానుడు భగభగలాడుతున్నాడు. జిల్లాలో అత్యధికంగా 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మార్చి ఆరంభం లోనే వేసవి తాపానికి ప్రజలు అల్లాడుతున్నారు. ఎండను దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు...

ఫిబ్రవరి రెండో వారం నుంచి భగభగలాడుతున్న సూర్యుడు మార్చి ఆరంభం నాటికి తన ప్రతాపాన్ని పెంచేశాడు. గత వారం రోజుల నుంచి ఎండ తీవ్రరూపం దాల్చింది. పగటి పూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. నంద్యాల జిల్లాలో గతేడాది ఇదే సమయానికి పగటి పూట అత్యధికంగా 36 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కాగా ఈ ఏడాది 38 డిగ్రీలకు చేరుకుంది. నంద్యాల, ఆళ్లగడ్డ, నందికొట్కూరు, పాణ్యం, బనగానపల్లెలో శుక్రవారం అత్యధికంగా 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఆత్మకూరులో 37 డిగ్రీలు, డోన్‌లో 36 డిగ్రీల ఉష్ణోగ్రత

నమోదైంది. అత్యధిక ఉష్ణోగ్రత వల్ల ఎండ సెగ తీవ్ర స్థాయిలో కనిపించింది. ఎండ ధాటికి తట్టుకోలేక నగరంలో మధ్యాహ్నం పూట రోడ్ల మీద జన సంచారం పలుచబడింది. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ రోడ్ల మీద జనం చాలా తక్కువగా కనిపించారు. అత్యవసర పనుల విషయంలో మినహాయించి మిగతా సందర్భాల్లో రోడ్ల మీదకు వచ్చేందుకు జనం జంకే పరిస్థితి ఏర్పడింది. నంద్యాల నగరంలోని శ్రీనివాస కూడలి, గాంధీ చౌక్, నూనెపల్లె, బస్టాండు ప్రాంతాలతో పాటు జిల్లా వ్యాప్తంగా అన్ని పట్టణాల్లో మధ్యాహ్నం పూట నిర్మానుష్యంగా కనిపించాయి. అవసరమై రోడ్ల మీద తిరిగేవారు ఎక్కువగా చెట్ల నీడను ఆశ్రయిస్తూ కనిపిస్తున్నారు.

ఎక్కువ ప్రమాదం ఎవరికంటే..

ఎండ సమయంలో బయట ఎక్కువగా తిరగడం వల్ల పిల్లల్లో ఎక్కువగా వడదెబ్బ తగిలే అవకాశం ఉందని వైద్యులు అంటున్నారు. చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, క్రీడాకారులు, బాలింతలపై ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. దీర్ఘకాలక వ్యాధులు, స్థూలకాయం ఉన్నవారు, మద్యం ఎక్కువగా తీసుకునే వారు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.

జాగ్రత్తలు తప్పవంటున్న నిపుణులు

ప్రజలు బయట తిరిగే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు, వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వడదెబ్బ వంటివి తగలకుండా నీటిని ఎక్కువగా తీసుకుంటూ సాధ్యమైనంత వరకూ నీడలో ఉండాలని సూచిస్తున్నారు. వడదెబ్బ తగిలిన తరువాత మళ్లీ ఎండలోకి వెళ్లకూడదని, చల్లని నీడలో విశ్రాంతి తీసుకోవాలని అంటున్నారు. బయట తిరిగే సమయంలో తలకు టోపీ పెట్టుకోవాలని, గొడుగు వాడాలని, రోజుకు ఐదు లీటర్లకు తగ్గకుండా నీరు తాగాలని, సమయానికి ఆహారం తీసుకోవాలని, ఉప్పు కలిపిన ద్రవాలు తాగాలని, శరీరంలో నీటి శాతాన్ని పెంచుకునేందుకు పుచ్చకాయ, కొబ్బరి నీళ్లు తాగాలని, వదులైన కాటన్ దుస్తులు ధరించాలని సూచిస్తున్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఇంటర్మీడియట్ ఫైనల్ పరీక్షలు ప్రారంభమైయ్యాయి. మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్ష శుక్రవారం జరిగింది. ఈ పరీక్షకు 12909 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 12408 మంది విద్యార్థులు హాజరయ్యారు. 501 మంది విద్యా ర్థులు గైర్హాజరయ్యారు. వివిధ కళాశాలలోని పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ కే. శ్రీనివాసులు, జిల్లా ఎస్పీ కే. రఘు వీర్ రెడ్డిలు సందర్శించి విద్యార్థులు రాస్తున్న పరీక్షలను పరిశీలించారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఎలాంటి మాస్ కాపీంగ్ గానీ, అవాంఛనీయ సంఘటనలు జరుగలేదని డివిఈఓ సునీత తెలిపారు.

పరీక్షలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పి

6న చంద్రబాబు నంద్యాల పర్యటన

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఈనెల 6న మాజీ ముఖ్యమంత్రి తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు నంద్యాల జిల్లాకు రానున్నారు. నంద్యాలలో జరుగు బహిరంగ సభలో ఆయన పాల్గొన నున్నారు. అందుకు సంబంధించి శుక్రవారం రాణి మహారాణి వెనుక వైపు బహిరంగ ఏర్పాటుకు సంబంధించిన స్థలాన్ని మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ పోలీట్ బ్యూరో సభ్యులు, నంద్యాల నియోజకవర్గ ఇన్చార్జి ఎన్ఎండి ఫరూక్, జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ తదితర నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర పర్యటనలో భాగంగా నారా చంద్రబాబునాయుడు ఈనెల 6వ తేదీన నంద్యాలకు రానున్నట్లు తెలిపారు. నంద్యాలలో జరుగు చంద్రబాబు నాయుడు సభను విజయవంతం చేసే దిశగా నంద్యాలలో రాణి మహారాణి థియేటర్ వెనక ఉన్న ఖాళీ స్థలాన్ని పరిశీలిస్తున్నట్లు వారు వెల్లడించారు. నంద్యాల ఎమ్మెల్యే టికెట్‌ను తనకు కేటాయించిన తర్వాత మొదటిసారిగా నంద్యాలకు వస్తున్న తరుణంలో ఈ సభను విజయవంతం చేయాలని ఎన్ఎండి ఫరూక్ తెలుగుదేశం నాయకులను, కార్యకర్తలను కోరారు.

సభా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎన్ఎండి ఫరూక్, మల్లెల రాజశేఖర్ తదితరులు

పాదయాత్రగా మల్లన్న భక్తులు

- అటవీమార్గంలో నామమాత్రంగా ఏర్పాట్లు
- తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల క్షేత్రంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో స్వామి అమ్మ వార్లను దర్శించుకునేందుకు భక్తులు కాలినడకన పాదయాత్రగా శ్రీశైలం చేరు కుంటున్నారు. పాద యాత్రగా వస్తున్న అటవీ మార్గమంలో చేయాల్సిన ఏర్పాట్లు నామ మాత్రంగా ఉన్నాయని భక్తులు ఆరోపిస్తున్నారు. అనంత పురం, కర్నూలు జిల్లాల నుండి అధిక సంఖ్యలో శివ స్వాములు, సాధారణ భక్తులు వెంకటాపురం వరకు ప్రత్యేక వాహనాల్లో చేరుకొని అక్కడి నుండి నల్లమల అడవులలో పాదయాత్రగా శ్రీశైలం చేరుకుం టున్నారు. వెంకటాపురం, బైర్లూటి, పెద్ద చెరువు, నాగలూటి, మఠం బావి, భీమునుకొలను, కైలాస ద్వారం మీదుగా హఠకేశ్వరం, సాక్షి గణపతిల మీదుగా శ్రీశైలం చేరుకుంటున్న భక్తులు మార్గమధ్యలో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. అధికారులు చెప్పినట్లుగా ఏర్పాట్లు ఏ మాత్రం లేవని చెబుతున్నారు. ముఖ్యంగా తాగునీటి సమస్య అధికంగా ఎదుర్కొంటున్నామని వాపోయారు. ఈ సంవత్సరం తాగునీటి సమస్యతో ఇబ్బంది పడ్డామని తెలిపారు. వెంకటాపురంలో కొనుక్కున్న తాగునీటి బాటిళ్లు ఏమాత్రం సరిపోవడం లేదని, మార్గమధ్యంలో కేవలం పెదాలు తడుపుకుంటూ శ్రీశైలం చేరుకుంటున్నామని పేర్కొంటున్నారు. ఎండలు అధికంగా ఉన్నప్పటికీ అధికారులు తగిన చర్యలు ముందస్తుగా చేపట్టలేదంటున్నారు. రోజురోజుకు అధికారులు ఇప్పటికైనా స్పందించి అడవిలోని కాలినడక మార్గంలో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని భక్తులు కోరుతున్నారు.

అడవిలో కాలినడకన శ్రీశైలం వస్తున్న భక్తులు

భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేస్తాం

- రైతు సంఘం నేతలతో జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో సోలార్ బాధితులకు, కల్వకుర్తి 167 హైవే రోడ్డుకు భూములు కోల్పోతున్న రైతులకు సరైన నష్టపరిహారం రాకపోతే విచారించి అలాంటి రైతులకు తప్పక న్యాయం చేస్తామని జిల్లా కలెక్టర్ కే. శ్రీనివాసులు రైతు సంఘం నేతలకు హామీ ఇచ్చారు. శుక్రవారం రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ. రాజశేఖర్ నాయకత్వంలో ప్రతినిధి బృందం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. సోలార్ ప్రాజెక్ట్ కోసం,కల్వకుర్తి 167 హైవే రోడ్డు కోసం రైతుల నుండి భూములు సేకరిస్తున్నారని, అయితే వారికీ సరైన నష్టపరిహారం కానీ, ప్రత్యామ్నాయంగానీ అధికారులు చూపడం లేదని, బలవంతపు భూసేకరణ చేస్తూ రైతులను, ప్రజలను అధికారులు, ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తున్నారని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. అందుకు స్పందించిన జిల్లా కలెక్టర్ రైతు సంఘం నాయకులతో మాట్లాడుతూ రైతుల భూములకు గిట్టుబాటు కానప్పుడు భూములు ఎందుకు ఇస్తున్నారని,రైతులు ఎవరికీ భయపడనవసరం లేదన్నారు. సోలార్,కల్వకుర్తి 167 హైవే కింద భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేస్తానన్నారు. భూములు కోల్పోయిన రైతులందరూ తమ వివరాలను తనకు అందజేయాలని సూచించారు. ఇప్పుడు ఇస్తున్న నష్టపరిహారం సరిపోదని అర్జీలు ఇవ్వాలని వాటిపై చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. పిన్నాపురం సోలార్ బాధిత రైతుల సమస్య కూడా తన దృష్టిలో ఉందని వాటిని కూడా పరిష్కారం చేస్తానని కలెక్టర్ రైతు సంఘం నాయకులతో పేర్కొన్నారు. అనుభవంలో ఉన్న ప్రభుత్వ భూములకు పేదలకు పట్టాలు, పాసు పుస్తకాలు ఇవ్వడానికి తగు చర్యలు చేపడతానన్నారు. ఆర్డీవోని విచారణ అధికారిగా నియమించి సమస్య పరిష్కారానికి తగు ఆదేశాలు ఇస్తానని కలెక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. అంతకుముందు కలెక్టర్‌ను కలిసిన ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ .రాజశేఖర్, సిఐటియు జిల్లా నాయకులు రత్నమయ్యలు మాట్లాడారు. పాణ్యం మండలం ఆలమూరు, కందికాయ పల్లె గ్రామాల సోలార్ బాధితులకు, కల్వకుర్తి 167 హైవే రోడ్డుకు భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయాలని,ప్రభుత్వమే భూసేకరణ చేపట్టాలని జిల్లా కలెక్టర్‌ని కోరారు. నేరుగా కలెక్టర్ జోక్యం చేసుకొని 2013 భూ సేకరణ చట్టం అమలు చేయాలని, పట్టా భూములతో పాటు డి పట్టా భూములకు, అనుభవంలో ఉన్న ప్రభుత్వ భూములకు సమానంగా ధర నిర్ణయించాలని కోరారు. గ్రామాల్లో ఉన్న భూమిలేని వ్యవసాయ కార్మికులు ,నాయి బ్రాహ్మలు, దోబీ కార్మికులకు చట్ట ప్రకారం 5,50,000 ప్రతి కుటుంబానికి ఇవ్వాలని, భూములు కోల్పోయిన రైతు కుటుంబాలకు పునరావసం కల్పించాలని కలెక్టర్ శ్రీనివాసులును వారు కోరారు. ఆలమూరు కందికాయ పల్లె గ్రామాలలో ప్రభుత్వ భూములను పేదలకు పట్టాలు, పాస్ బుక్కులు మంజూరు చేయాలని, గత పది సంవత్సరాలుగా తాసిల్దారు, కలెక్టర్‌ని కలిసినప్పటికీ బాధితుల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ఒకవైపు అనుభవంలో ఉన్న ప్రభుత్వ భూములను పేదలకు పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వం చెబుతున్నా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పేదలకు ఎలాంటి న్యాయం చేయలేదని కలెక్టర్‌కు వివరించారు. ఇప్పటికైనా కొత్తగా వచ్చిన మీరైనా ఆ గ్రామాల ప్రజలకు న్యాయం చేయాలని నాయకులు కలెక్టర్‌ని కోరారు. కలెక్టర్‌ను కలసిన వారిలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఏ. సురేష్, సిఐటియు నాయకులు రాజు,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు డేవిడ్ తదితరులు ఉన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

ఎంపి, ఎమ్మెల్యే, గంగుల ప్రభాకర్‌రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న నాయకులు తదితరులు

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

- గంగుల ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

నియోజకవర్గ అభివద్ధి ధ్యేయంగా తాము పనిచేస్తున్నామని రాష్ట్ర జల వనరుల శాఖ ప్రభుత్వ సలహాదారులు గంగుల ప్రభాకర్ రెడ్డి, శాసనసభ్యులు గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం ఆళ్లగడ్డ మండలంలోని బాచాపురం మెట్ట వద్ద కల్వర్టు పైపులైను, బాచాపురం, జి. జంబులదిన్నె, గోపాలపురం, పేరాయి పల్లె, నల్లగట్ల, బత్తులూరు తదితర గ్రామాలలో దాదాపు మూడు కోట్ల రూపాయలతో నూతనంగా నిర్మించిన సిసి రోడ్లను, వాటర్ ట్యాంక్, హెల్త్ సెంటర్, సీసీ డ్రైనేజీలు మరియు నాడు-నేడు కింద పాఠశాలలో చేసిన అభివద్ధి పనులను ఎంపిపి గజ్జల రాఘవేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో నంద్యాల ఎంపి పోచా బ్రహ్మానందరెడ్డితో కలిసి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సహకారంతో నియోజకవర్గంలో ఐదు సంవత్సరాల కాలంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశామన్నారు. అలాగే అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించామన్నారు. 2019 ఎన్నికల్లో ఆళ్లగడ్డ తాలూకా ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు అన్ని అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేసి వాటిని ప్రారంభించడం జరిగిందన్నారు. కావున ప్రజలు కూడా ఆలోచించి రానున్న ఎన్నికల్లో వైకాపాను గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నందీశ్వరయ్య, ఉపసర్పంచ్ లక్ష్మీదేవి, జడ్పిటిసి లక్ష్మీదేవి, రాచంరెడ్డి రామ్మోహన్ రెడ్డి, గూబగుండం వెంకటసుబ్బారెడ్డి, యాదవాడ నరసింహారెడ్డి, మర్రిపల్లె తులసీశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ వేలం పాటలు వాయిదా

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు పురపాలక సంఘం 2024-25 గాను వారపు సంత, దిన కూరగాయల మార్కెట్ బస్టాండ్ ఫీజులు, జంతువధ శాల, మాంసపు మార్కెట్ సంబంధించిన బహిరంగ వేలం పాటలు శుక్రవారం జరగాల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు మున్సిపల్ కమిషనర్ టి.సుధాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి ఈ బహిరంగ వేలం పాటలు ఈ నెల 5వ తేది ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయం జై కిసాన్ పార్కులో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

డోన్ ప్రయోజనాల కోసం టిడిపిని గెలిపించండి

- డోన్ టిడిపి అభ్యర్థి కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి

ప్రజాశక్తి-డోన్

డోన్ ప్రజల ప్రయోజనాల కోసం టిడిపిని గెలిపించాలని మాజీ కేంద్ర మంత్రి డోన్ టిడిపి అభ్యర్థి కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి, మాజీ ఉపముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం టిడిపి నేతలు స్థానిక అమ్మ హోటల్ నుంచి భారీ ఊరేగింపుతో మధు ఫంక్షన్ హాల్‌కు చేరుకున్నారు. మధు ఫంక్షన్ హాల్‌లో టిడిపి కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో మాజీ కేంద్ర మంత్రి డోన్ టిడిపి అభ్యర్థి కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ ఆర్థిక మంత్రి బుగ్గన ఆరాచకాలను ఎదుర్కొని డోన్ నియోజకవర్గ ప్రజల భవిష్యత్తు కోసం అందరూ కలిసి టిడిపిని గెలిపించాలని కోరారు. లిక్కర్ మైనింగ్ పేరుతో వైసిపి ప్రభుత్వం దోపిడీ చేస్తుందని ఇక్కడ ఎలాంటి అభివృద్ధి జరగలేదని విమర్శించారు. మైనింగ్ నిక్షేపాలు ఉన్న డోన్‌లో పరిశ్రమ ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో స్వార్థ ప్రయోజనాలు తప్ప యువతకి ఉపాధి చూపడంలో విఫలమయ్యారని అన్నారు. కొందరు సర్పంచుల మీద ఒత్తిడి చేసి వైసిపిలోకి చేరాలని భయబ్రాంతులకు గురి చేస్తున్నారని అలాంటి పార్టీని ఎదుర్కొని టిడిపి నాయకులను కార్యకర్తలను కాపాడుకోవడానికి అండగా ఉంటానని అన్నారు.

మాజీ ఉపముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ చూసినా వైసిపి సిద్ధం బోర్డులు కనబడుతున్నాయని వచ్చే ఎన్నికలలో ఓడిపోయి పారిపోవడానికి సిద్ధంగా ఉండాలని అన్నారు. బాబాయిని హత్య చేసినట్లు సొంత చెల్లెలు చెబుతున్న ఆయనకు అర్థం కావడం లేదా అని ప్రశ్నించారు. కోడి కత్తి డ్రామాతో రాష్ట్ర ప్రజలను మోసం చేశారని భవిష్యత్తులో ఆయన డ్రామాలు పనిచేయవని అన్నారు. టిడిపి వైసిపిని ఓడించడానికి అన్ని విధాల సిద్ధమైందని ఉన్నారు. చంద్రబాబు నాయుడును సరైన కారణం లేకపోయినా జైల్లో పెట్టించారని భవిష్యత్తులో ఓడిపోయిన తర్వాత జైల్లో ఉండటానికి వైయస్ జగన్మోహన్ రెడ్డి సిద్ధంగా ఉండాలని అన్నారు. గతంలో డోన్ నుంచి నన్ను గెలిపిం చినట్లుగానే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డిని గెలిపించి చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, పత్తికొండ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యాంబాబు, టిడిపి యువ నాయకులు కోట్ల రాఘవేంద్ర రెడ్డి, కోట్ల నివేదితమ్మ, ఓబులాపురం శేషిరెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వై నాగేశ్వరరావు యాదవ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ టిఈ కేశన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి

ప్రజల అభివృద్ధే వైసిపి లక్ష్యం

ఎమ్మెల్యే అభ్యర్థి ధార సుధీర్

ప్రజాశక్తి - పాములపాడు

రాష్ట్రంలో ప్రతి కుటుంబం అభివృద్ధి చెందడమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని నందికొట్కూర్ వైసిపి అభ్యర్థి డాక్టర్ దారా సుధీర్ అన్నారు. శుక్రవారం పాములపాడు మండలం భానుముక్కల, చెలిమిల్ల, లింగాల గ్రామాలలో కార్యకర్తల పరిచయ కార్యక్రమంలో భాగంగా పార్టీ నాయకులను కలిశారు. గ్రామాలలోని ఎస్సీ కాలనీలోని ప్రతి కుటుంబంతో ఆయన పరిచయం చేసుకున్నారు. జగనన్న చేసిన అభివృద్ధిని, పథకాలను వివరించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఓ లక్ష్యం కలిగిన వ్యక్తి అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపిలో వాలంటరీ వ్యవస్థ ద్వారా ప్రజల ఇంటి దగ్గరికి సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. విద్య, వైద్యం ప్రతి పేద కుటుంబానికి అందేలా విప్లవాత్మక మార్పులు తెచ్చారని, రానున్న ఎన్నికల్లో జగనన్నను మళ్ళీ దీవించాలని కోరారు. అనంతరం తుమ్మలూరు గ్రామంలో పేదలకు ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. లింగాల గ్రామంలో డాక్టర్ సుధీర్ ఆధ్వర్యంలో రంగారెడ్డితో పాటు 20 కుటుంబాలు వైసిపిలో చేరాయి. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షులు జి రామలింగేశ్వర రెడ్డి, మండల నాయకులు విజయసింహారెడ్డి, మండల కార్యదర్శి మధుసూదన్ రావు, మద్దూర్ సింగిల్ విండో సొసైటీ చైర్మన్ కృష్ణారెడ్డి, సర్పంచులు కోట్ల చంద్రారెడ్డి, వరప్రసాదరావు, సొసైటీ చైర్మన్ చౌడయ్య, భూషణం, సమ్మద్, నాయకులు ప్రతాప్ రెడ్డి, ఎల్వి రమణారెడ్డి, బాలేశ్వర్ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, వైసీపీ మండల వైస్ ప్రెసిడెంట్ మాలిక్ భాష, బంగారం మౌలాలి, బాలు నాయక్, పుల్లయ్య, హుస్సేన్ ఎంపిటిసి సురేష్, డైరెక్టర్ గోపాల్, నాయకులు ప్రభాకర్, అంబయ్య, జబ్బారు, మహానంది రెడ్డి, కమలాకర్, ఉపేంద్ర, యూత్ అధ్యక్షులు చరణ్, అంబన్న తదితరులు పాల్గొన్నారు.

పరిచయ కార్యక్రమంలో భాగంగా గ్రామాలలో తిరుగుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి ధార సుధీర్

ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై పటిష్ట ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు 16 కమిటీల నోడల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన ఛాంబర్‌లో జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి ఎన్నికల నిర్వహణపై నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణను నిర్ణీత షెడ్యూల్‌లోగా పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని 16 కమిటీల నోడల్ అధికారులను ఆదేశించారు. పోలింగ్ విధుల నిర్వహణకు సిబ్బందిని సమకూర్చుకోవడంతో పాటు గైర్హాజరు కాకుండా రిజర్వు సిబ్బందిని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. పోలింగ్ సిబ్బంది, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్, స్టాటిస్టిక్ సర్వైలెన్స్ టీమ్స్, వీడియో సర్వైలెన్స్ టీమ్స్, వీడియో వ్యూవింగ్ తదితర అన్ని రకాల బృంద అధికారులకు శిక్షణ నివ్వడంతో పాటు గైర్హాజరు కాకుండా చూసుకోవాలని, ఎన్నికల సంఘం సూచించిన అన్ని అంశాలపై అప్రమత్తంగా ఉండి విధులను నిర్వహిం చాలని, పోలింగ్ మెటీరియల్ సరఫరా లోటుపాట్లు లేకుండా నివేదికలు తయారు చేసుకుని సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చు వివరాల పర్యవేక్షణపై ఏర్పాటు చేసుకున్న ఎంసిసి బృందాలకు ప్రాపర్ శిక్షణ నివ్వాలన్నారు.

తాగునీటి ట్యాంకర్లు ప్రారంభం

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు మున్సిపల్ కార్యాలయానికి వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ధార సుధీర్ అందజేసిన రెండు మంచినీటి ట్యాంకర్లను శుక్రవారం శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రజలకు నీటి ఎద్దడి రాకుండా మంచినీటి ట్యాంకర్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, నూతన కమిషనర్ టి.సుధాకర్ రెడ్డి, వైస్ చైర్మన్ అర్షపోగు ప్రశాంతి, కో ఆప్షన్ సభ్యులు కేశవరెడ్డి శ్రీనివాస రెడ్డి, అబ్దుల్ గఫార్, పట్టణ అధ్యక్షులు మన్సూర్, ఉపాధ్యక్షులు చింతా విజ్జి, జిల్లా ఎక్జిక్యూటివ్ మెంబర్ ఉస్మాన్ బేగ్, కౌన్సిలర్లు కాటెపోగు చిన్న రాజు, మనపాడు అశోక్, చాంద్ భాష, అబ్దుల్ రవూఫ్, చెరుకు సురేష్, లాలు ప్రసాద్, షేక్ నాయబ్, అల్లూరి క్రిష్ణ, మందడి రవీంద్రా రెడ్డి, సన అబ్దుల్లా, జె.రాధిక, శాంత కుమారి, చింత లక్ష్మిదేవి, సప్లయర్ సత్యనారాయణ, గుర్రాల భాస్కర్ రెడ్డి, బోయ శేఖర్, శాలి భాష, బ్రహ్మయ్య ఆచారి, కురువ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి ట్యాంకర్లను ప్రారంభించిన బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి

బూతులను పరిశీలిస్తున్న కమిషనర్, తదితరులు

పోలింగ్ కేంద్రాల్లో అన్నీ సౌకర్యాలు : కమిషనర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పోలింగ్ బూత్‌లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్నీ సౌకర్యాలకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం నంద్యాల పట్టణంలోని పలు పోలింగ్ బూతులను నంద్యాల మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి పరిశీలించారు. నంద్యాల పురపాలక సంఘం పరిధిలోని పీపుల్స్ క్లబ్ (రోటరీ క్లబ్) పోలింగ్ బూత్‌ను పరిశీలించి బూత్‌లలో ఉన్న సమస్యలపైన ఆరా తీశారు. మునిసిపల్ ఇంజినీర్ రమణ మూర్తి,రూట్ ఆఫీసర్, బిఎల్ఓలు, ఉన్నారు.

మాట్లాడుతున్న ఐసిడిఎస్ సూపర్వైజర్ లక్ష్మీదేవి

బాలికలు అన్ని రంగాలలో రాణించాలి

ప్రజాశక్తి - రుద్రవరం

బాలికలు విద్యతోపాటు అని రంగాలలో రాణించాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ లక్ష్మీదేవి తెలిపారు. శుక్రవారం రుద్రవరంలోని కస్తూర్బా గురుకుల పాఠశాలలో బేటి బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికల విద్య ఉన్నతి బాలికల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం భేటీ బచావో బేటి పడావో పథకాన్ని తీసుకొని రావడం జరిగిందన్నారు. బాల్య వివాహాలు చేయడం వలన కలిగే నష్టాలు ఇబ్బందులు గురించి తెలియజేయడం జరిగిందన్నారు. మహిళా పోలీస్ విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించారు. లింగవివక్షత గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమానికిమహిళా పోలీస్ సామక్క,స్కూల్ టీచర్స్,అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దర్గా వద్ద భక్తులకు అన్నదానం చేస్తున్న గూడాల సోదరులు

ముగిసిన దర్గా ఉరుసు

ప్రజాశక్తి - అవుకు

మండలంలోని కునుకుంట్ల ఉప్పలపాడుకు వెళ్లే రహదారిలో ఉన్న హజరత్ శేక్షావలి దర్గా ఉరుసు మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. దర్గాకు వచ్చే భక్తుల కోసం స్థానిక గూడాల సోదరులు ఉదయం అల్పాహారం మధ్యాహ్నం భోజన కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించారు. ఉరుసు సందర్భంగా దర్గా వద్దకు అధిక సంఖ్యలో భక్తులు చేరుకోవటంతో దర్గా పరిసర ప్రాంతాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. బనగానపల్లె ఆర్టీసీ డిపో అధికారులు ఉర్సు సందర్భంగా ప్రత్యేక సర్వీసులను కూడా నడపడంతో భక్తులు సంతోషం వ్యక్తం చేశారు. దర్గాకు వచ్చే భక్తుల కోసం భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలవకుండా అన్నదానం నీటి వసతిని గూడాల సోదరులు కల్పించడంతో భక్తులు సంతోషం వ్యక్తం చేశారు. దర్గా వద్ద భక్తులు కానుకలను సమర్పించి తమ ముక్కులను తీర్చుకున్నారు.

వృద్ధ అనాధ శరణాలయంలో అన్నదానం చేస్తున్న టిడిపి నాయకులు

ఘనంగా ఎంఎస్ అన్సర్ బాష పుట్టినరోజు

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి మేజర్ గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు ఎంఎస్‌అన్సర్ బాష పుట్టినరోజు వేడుకలను టిడిపి నాయకులు నాల్గవ ఎంపీటీసీ ఇంచార్జ్ జెట్టి నాగరాజు, ప్రచార కార్యదర్శి గఫార్, తెలుగు యువత అధ్యక్షులు మద్దూరుమాబూలాల్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని నగల పాడు గ్రామ సమీపంలోని వద్ధ అనాథ శరణాలయంలోని వృద్ధులకు, టిడిపి నాయకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కేక్ కోసి అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ సమీయుద్దీన్, ఎంఎస్ అజిముద్దీన్, టిడిపి పట్టణ ఉపాధ్యక్షులు ముల్లా షాబులు, క్లస్టర్ ఇన్చార్జి ముల్లా అజీమ్, టిడిపి నాయకులు నూర్ భాషా, జెట్టి సుధాకర్ ,కె ఆర్ కె రవి, బారిక్ ఛామల్ మా భాష, వెరైటీ టైలర్ ఖాదర్, మద్దూర్ షబ్బీర్, బాష, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

బిటి రోడ్డు ఏర్పాటు : చైర్మన్

ప్రజాశక్తి-డోన్

రోడ్డు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

ప్రజల సౌకర్యార్థం 80 లక్షల రూపాయలతో 1100 అడుగుల బీటిరోడ్డును ఏర్పాటు చేస్తున్నట్లు డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. శుక్రవారం డోన్ పట్టణంలోని కోర్టు రోడ్డు నుంచి తారక రామనగర్ కి అనుసంధానం చేస్తూ 1100 అడుగుల పొడవుతో బీటి రోడ్డును 80 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న టువంటి పనులను మున్సిపల్ చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీవాసుల కోరిక మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆదేశాలతో 80 లక్షల రూపాయలు స్పెషల్ గ్రాంట్స్ కింద నిధులు మంజూరు చేశారని తెలిపారు. డోన్ పట్టణంలో పెద్ద రోడ్లకు సంబంధించి అన్ని పనులు పూర్తి చేశామని, ప్రజలకు ఎలక్షన్స్ లోపల గతంలో ఇచ్చినటువంటి మాట ప్రకారం 10 కోట్ల రూపాయలతో పనులు మున్సిపాలిటీలో పూర్తి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్ఎండి జాకీర్ హుస్సేన్, కౌన్సిలర్లు మిట్టా ఉమామహేశ్వరి,నాగేంద్ర,ఆర్ట్ రమణ,కటిక వేణు,నంద్యాల జిల్లా బీసీ అధ్యక్షులు పోస్ట్ ప్రసాద్,డోన్ పట్టణ యూత్ అధ్యక్షులు ఆర్ఇ రాజవర్ధన్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మిట్టారవి,రైల్వే నాయుడు, మున్సిపల్ డిఈ రసూల్,ఏఈ సురేష్,కాంట్రాక్టర్ అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బికెకు రైతులు తాళం

- అధికారులు ఖాళీ సంచులు ఇవ్వడం లేదని ఆగ్రహం
- జొన్నలు కొనుగోలు చేయడం లేదని నిరసన

ప్రజాశక్తి - గడివేముల

మండలంలోని పెసరవాయి గ్రామంలో శుక్రవారం నాడు రైతులు రైతు భరోసా కేంద్రానికి తాళం వేసి ఆందోళన చేశారు. పెసరవాయి గ్రామంలో 1300 ఎకరాల్లో జొన్న పంటను రైతులు సాగు చేశారు. ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధరను మార్క్ఫెడ్ ద్వారా క్వింటాకు రూ.3180 చొప్పున ప్రకటించింది. గ్రామంలోని ఓ రైతుకు ఐదు ఎకరాలు చొప్పున 100 క్వింటాల జొన్నలను రైతుల నుండి కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే గ్రామంలో రైతుల వద్ద నుంచి మార్క్‌ఫెడ్ అధికారులు రైతులకు ఇబ్బందులు గురిచేస్తూ కొనుగోలు చేయడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం చెప్పిన ఆదేశాల మేరకు రైతులకు ఖాళీ సంచులు ఇవ్వకుండా జొన్నలు కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బంది పెడుతున్నారని గ్రామ రైతులు తెలిపారు. ఎకరాకు 20 క్వింటాలు చొప్పున ఐదు ఎకరాలకు 100 క్వింటాలను కొనుగోలు చేసి రెండు వందల సంచులను రైతులకు ఇవ్వాలని ఆదేశాలు ఉన్న అధికారుల నిర్లక్ష్యంతో ఎకరాకు ఐదు సంచులు చొప్పున ఐదు ఎకరాలకు 25 సంచులు ఇస్తామని అధికారులు రైతులకు తెలియజేయడంతో ఆగ్రహించిన రైతులు రైతు భరోసా కేంద్రానికి తాళం వేసి నిరసన చేపట్టారు. గ్రామానికి చెందిన రైతులకు జొన్న కొనుగోలు చేసి రైతులకు న్యాయం జరగకపోతే కలెక్టర్ కార్యాలయం నిరసన చేపడతామని అధికారులను రైతులు హెచ్చరించారు.

వ్యవసాయ అధికారిని చుట్టుముట్టిన రైతులు

మేనిఫెస్టో 99 శాతం అమలు : ఎమ్మెల్యే

- ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ

ప్రజాశక్తి - ఆత్మకూరు

వైఎస్ఆర్ ప్రభుత్వం మేనిఫెస్టోను 99 శాతం అమలు చేసిందని, ఈ ఘనత కేవలం సిఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని ఇంటి పట్టాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలను శుక్రవారం స్థానిక మార్కెట్ యార్డ్‌లో లబ్ధిదారులకుఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా ఆత్మకూరు మున్సిపాలిటీలో సెంటున్నర స్థలం ఇచ్చిన ఘనత వైసిపి ప్రభుత్వానిదేనన్నారు. ఆత్మకూరు మండల, పట్టణ వాసులందరికీ ఇంటి పట్టాలు ఇవ్వడమే కాకుండా పూర్తిస్థాయి హక్కు రిజిస్ట్రేషన్ చేసి ఇస్తున్నామంటే అదికేవలం రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే సాధ్యమైం దని అన్నారు. ప్రతిపక్ష నాయకుల కల్లబొల్లి మాటలు ఎవరూ నమ్మొద్దని లబ్ధిదారులను ఉద్దేశించి ప్రసంగించారు. వైసిపి శ్రీశైలం నియోజవర్గ నాయకులు శిల్ప భువనేశ్వర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు వైఎస్ఆర్ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ కమిషనర్ హరి ప్రసాద్. ఎంపీపీ నల్లకాల్వ తిరుపాలమ్మ. జడ్పిటిసి సభ్యుడు శంకర్ రెడ్డి. మున్సిపాలిటీ వైస్ చైర్మన్ రాజగోపాల్. కౌన్సిలర్లు విజయ్ చౌదరి. మారుబోతుల విజయ్. సుల్తాన్. బోయ పార్వతమ్మ. పాణ్యం పార్వతమ్మ. బోయ లక్ష్మమ్మ. వైసిపి మండల అధ్యక్షులు రాజమోహన్ రెడ్డి. పట్టణ అధ్యక్షుడు సయ్యద్మీర్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఇంటి పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

సంక్షేమ బోర్డును సమర్ధవంతంగా నిర్వహించాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఆత్మకూర్

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును సమర్ధవంతంగా నిర్వహించాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, సంక్షేమ బోర్డు నిధులు 2000 కోట్లు సంక్షేమ బోర్డుకు రాష్ట్ర ప్రభుత్వం జమ చెయ్యాలని సిఐటియు పట్టణ కార్యదర్శి రామ్ నాయక్, ఎపి బిల్డింగ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు నాగేశ్వరరావు, ఇస్మాయిల్ డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా శుక్రవారం పట్టణంలోని లేబర్ కార్యాలయంలో అధికారి సారా మార్గారేట్‌కు సిఐటియు ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయడంలో, సంక్షేమ బోర్డును సమర్ధవంతంగా నిర్వహించడంలో నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డు ద్వారా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం పని చేయాల్సిన ప్రభుత్వం ఆ పని చేయకుండా కార్మికుల సెస్ ద్వారా బోర్డులో ఉన్న రూ. 2 వేల కోట్లు ఇతర అవసరాలకు దారి మళ్లించి కార్మికుల సంక్షేమానికి తూట్లు పొడిచిందన్నారు. మరో వైపు కరోనా కాలం నుంచి నేటి వరకు భవన నిర్మాణ కార్మికులకు పనులు కల్పించి ఆదుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. జీఓ 12, 14ను విడుదల చేసి పని లేకుండా చేసిందన్నారు. 30 లక్షలు మంది కార్మికుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని అన్నారు. తమిళనాడు, కేరళ, ఇతర రాష్ట్రాల్లో భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, ఎపిలో అమలు చేయకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో పి బిల్డింగ్ వర్కర్స్ యూనియన్, సిఐటియు నాయకులు రఫీ, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

కార్మిక శాఖ అధికారికి వినతిపత్రం అందిస్తున్న సిఐటియు నాయకులు

సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ముఖ్యమంత్రి సహాయనిధి నుండి నంద్యాల పట్టణానికి చెందిన 7మంది లబ్ధిదారులకు రూ.7 లక్షల 25వేల 500 చెక్కులను ఎమ్మెల్యే శిల్పారవిరెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. లబ్ధిదారుల తరుపున సీఎం జగన్ మోహన్ రెడ్డికి, ఎమ్మెల్యేకు నంద్యాల పట్టణ లీగల్ సెల్ అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వైసిపి నాయకులు లక్ష్మీనారాయణ, అడ్వకేట్ ప్రతాపరెడ్డి, కిరణ్ కుమార్,తిమోతి పాల్గొన్నారు.

మోడల్ స్కూల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి - బేతంచెర్ల

ఏపీ గవర్నమెంట్ మోడల్ స్కూల్లో వచ్చే విద్యా సంవత్సరానికి గాను ఆరవ తరగతి చదవడానికి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ టి మరియదాసు శుక్రవారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత ఆరవ తరగతి చదవడానికి అర్హత గల విద్యార్థులు ఈనెల రెండవ తేదీ నుండి ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. లేదా నేరుగా గోరుమాను కొండ మోడల్ స్కూల్ దగ్గరికి వచ్చి విద్యార్థులు అప్లై చేసుకోవచ్చని ఆయన తెలిపారు. పూర్తి వివరాలకు మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ మరియదాసును సంప్రదించవచ్చు అని తెలిపారు.

నందికొట్కూరు మున్సిపల్ కమిషనర్‌గా టి.సుధాకర్ రెడ్డి

పజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు పురపాలక సంఘం నూతన కమి షనర్‌గా టి.సుధాకర్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన మున్సిపల్ కమిషనర్ కిషోర్ రాయదుర్గానికి బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ టి.సుధాకర్ రెడ్డిని పలువురు అధికారులు, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

దేవస్థానానికి బ్యాటరీ కార్లు విరాళం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

బ్యాటరీ కార్లను అందజేస్తున్న ఎస్బిఐ రీజినల్ మేనేజర్

ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలం లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి ఆళ్లగడ్డ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు భక్తుల సౌకర్యం కోసం రెండు బ్యాటరీ కార్లను అందజేశారు. ఈ సందర్భంగా నంద్యాల ఎస్బిఐ రీజనల్ మేనేజర్ తేజోమూర్తుల శ్రీనివాస్, ఆళ్లగడ్డ ఎస్బిఐ చీఫ్ మేనేజర్ సంతోష్ కుమార్ లు అహోబిల దేవస్థానం జిపిఏ సంపత్, ఓ ఎస్ డి శివ ప్రసాద్‌లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి గెలుపునకు సైనికుల్లా పని చేయాలి

- జగత్ విఖ్యాత్ రెడ్డి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డలో టిడిపిని గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని తాలూకా టిడిపి యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి అన్నారు. శనివారం ఆళ్లగడ్డ మండలంలోని పెద్ద కందుకూరు గ్రామానికి చెందిన టిడిపి నాయకులు, కాంట్రాక్టర్ నన్నేబైగారి జిలాని, మాజీ జెడ్పిటిసి చాంద్ బాషాల ఆహ్వానం మేరకు పట్టణంలోని పద్మ వీధిలోని నన్నే బాయ్ గారి జిలాని ఇంటికి వెళ్లడం జరిగింది. ఈ సందర్భంగా భూమా జగత్ విఖ్యాతరెడ్డిని చాంద్ బాషా, నన్నేబై గారి జిలానిలు శాలువా కప్పి పూలమాలవేసి సన్మానించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. జిలాని కుటుంబ సభ్యులను అందరిని విఖ్యాత్ రెడ్డి ఆప్యాయంగా పలకరించారు. అనంతరం భూమా జగద్విఖ్యాత్ రెడ్డి మాట్లాడుతూ టిడిపి నాయకులకు, కార్యకర్తలకు భూమా కుటుంబం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. రామాచారి, భాస్కర్ యాదవ్ తదితరులు ఉన్నారు.

జగత్ విఖ్యాత్ రెడ్డిని సన్మానిస్తున్న నేతలు

సూపర్ సిక్స్ పథకాలను ఇంటింటికి తీసుకెళ్లాలి

- మాజీ ఎమ్మెల్యే బీసీ

ప్రజాశక్తి - బనగానపల్లె

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ఇంటింటికీ కార్యకర్తలు తీసుకెళ్లాలని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం, శంఖారావం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. టిడిపి నాయకులకు మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి శంఖారావం కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ', సూపర్ సిక్స్ పథకాలు, యువతకు 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, తల్లికి వందనం కింద వంటి పథకాలను టిడిపి నాయకులు కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి నంద్యాల రామేశ్వర రెడ్డి, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్య, తెలుగు యువత నంద్యాల జిల్లా అధ్యక్షులు బొబ్బల గోపాల్ రెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు కృష్ణ నాయక్ బిసి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దరాజుపాలెం భూషన్న, టిడిపి మండల అధ్యక్షులు పివి కుమార్ రెడ్డి, పట్టణ ఉపసర్పంచ్ బురానుద్దీన్, కాట్రెడ్డి మల్లికార్జున రెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షులు ఖాసిం బాబు, పాతపాడు, మిట్టపల్లె సర్పంచులు బెడదల మహేశ్వరరెడ్డి, తులసి రెడ్డి, టిడిపి నాయకులు యాగంటి పల్లె బండి మౌళేశ్వర రెడ్డి పసుపల బాల నాయుడు, మీరాపురం నారాయణరెడ్డి, పాతపాడు శంకేశ్వర రెడ్డి, లాయర్ నాగేంద్ర రెడ్డి ఖాదర్ బాషా కటికవానికుంట బాలరాజు యాదవ్, టిడీపీ సీనియర్ నాయకులు, క్లస్టర్ ఇంచార్జ్లు, యూనిట్ ఇంచార్జ్లు, బూత్ ఇంచార్జ్లు పాల్గొన్నారు.

శంఖారావం కిట్లను పంపిణీ చేస్తున్న బీసీ జనార్దన్ రెడ్డి

నీటి సమస్య లేకుండా చూస్తాం

ప్రజాశక్తి - కొత్తపల్లి

గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా చూస్తామని కో-ఆప్‌గ్రేడ్ మెంబర్ షేక్ మహమ్మద్ గౌస్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని శివపురం గ్రామంలో నీటి సమస్యను తీర్చేంచేందుకు బావి తీసేందుకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో నీటిసమస్య ఎక్కువగా ఉండడంతో శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. స్పందించిన ఆయన నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. రూ.5 లక్షల ఆర్థిక సహాయంతో నీటి సమస్యకు చెక్ పెట్టేందుకు బావి తీయిస్తున్నామని చెప్పారు. ఇకపై గ్రామంలో ప్రజలు నీటి సమస్యతో ఇబ్బంది పడరన్నారు. కార్యక్రమంలో కొలనుభారతి ఆలయ కమిటీ చైర్మన్ వెంకటనాయుడు, సర్పంచు చంద్రశేఖర్ యాదవ్, మాజీ సర్పంచులు రామకృష్ణ, శ్రీనివాసులు, వైసిపి నాయకులు మహబూబ్ బాషా, గ్రామస్తులు సింగారం నాగర్జున, ఫషీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

బావి కోసం భూమి పూజ చేస్తున్న నాయకులు

7 నుండి యాగంటి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి - బనగానపల్లె

శ్రీ ఉమామహేశ్వర స్వామి

ఈనెల 7వ తేదీ నుండి యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ చైర్మన్ తోట బుచ్చిరెడ్డిలు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ 7వ తేదీ గురువారం దేవస్థానంలో ఉదయం ఐదు గంటలకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకంలు, కుంకుమార్చన, సహస్ర నామవాళితో ప్రత్యేక పూజలు, ఉదయం ఎనిమిది గంటలకు ధ్వజ ఆరోహణతో ఉత్సవాలు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. 8వ తేదీ శుక్రవారం ఉదయం ఉమామహేశ్వరులకు ప్రత్యేక పూజలు, రాత్రి జబర్దస్త్ వారిచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్విహిస్తున్నట్లు వారు తెలిపారు. రాత్రి 12 గంటలకు లింగోద్భవ కార్యక్రమం తెల్లవారుజామున (తెల్లవారితే 9వ తేదీ) శ్రీ ఉమామహేశ్వర కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరగనున్నట్లు వారు తెలిపారు. 9వ తేదీ శనివారం నందికోల మహోత్సవం ,10వ తేదీ ఆదివారం స్వామి వారి రథోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. 11వ తేదీ సోమవారం శివదీక్ష విరమణ, పూర్ణాహుతి, నాగవల్లి, వసంతోత్సవం, తెప్పోత్సవం, ధ్వజవరోహణతో ఉత్సవాల ముగియను న్నట్లు వారు తెలిపారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు శ్రీ ఉమామహేశ్వర నిత్య అన్నదాన సంస్థ, శ్రీ ఉమామహేశ్వర రైతు అన్నదాన సత్రం, ఆర్యవైశ్య అన్నదాన సత్రం, బ్రాహ్మణ అన్నదాన సత్రం, బసవేశ్వర అన్నదాన సత్రం, యాదవ అన్నదాన సత్రం ఆధ్వర్యంలో ఉచిత అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

శ్రీశైలం క్షేత్రానికి
24 గంటలూ వాహనాలకు అనుమతి

ప్రజాశక్తి - శ్రీశైలం

మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైలం క్షేత్రానికి 24 గంటల పాటు వాహనాలు వెళ్లేందుకు ప్రభుత్వం అనుమతిని ఇచ్చింది. 1వ తేదీ శుక్రవారం నుండి 11వ తేదీ వరకు శ్రీశైలం క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామివారినీ దర్శించుకునేందుకు వాహనాల రాకపోకలకు అవకాశం కల్పించింది. అనుమతునిచ్చిన సమయంలో రాత్రిలో వన్యప్రాణాలకు ఎటువంటి హాని కలగకుండా ఇవ్వకుండా వాహనదారులు ప్రయాణించాలని సూచించారు. మిగిలిన రోజులు రాత్రి తొమ్మిది గంటల నుండి ఉదయం ఆరు గంటల వరకు ఎటువంటి వాహనాలకు అనుమతి లేదు. కేవలం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మాత్రమే ఈ 24 గంటలు వాహనాలను నడుపుకునేందుకు అవకాశం కల్పించారు.

ఎమ్మెల్యేకి వినతిపత్రం ఇస్తున్న ముస్లిం షియా మతస్తులు

షియాలను బిసి-ఇలో చేర్చాలి

ప్రజాశక్తి - బనగానపల్లె

షియా ముస్లిం సామాజిక వర్గాన్ని బిసి -ఈలో చేర్చాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి షియా ముస్లింలు వినతిపత్రం ఇచ్చారు. శుక్రవారం పట్టణంలోనే ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నివాసంలో సంభందించిన మతస్తులు అందరూ బనగానపల్లె శాసన సభ్యులు కాటసాని రామిరెడ్డిని వారి నివాసంలో షియా ముస్లిం మతస్తుల గురువయ్య, సయ్యద్ ఆలి అబ్బాస్, సయ్యద్ ముర్తుజ హుస్సేన్, సజాత్ హుస్సేన్‌ల ఆధ్వర్యంలో షియా సామాజిక వర్గాన్ని బీసీబీఈ కేటగిరీలో చేర్చే విధంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేకి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షియా ముస్లింలను బీసీ-ఈలో చేర్చితే తమకు ప్రభుత్వ పథకాలకు అమలు అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో షియా ముస్లిం నాయకులు సాబ్జాన్,కొండపేట అబ్బాస్, లిఖాయాత్, షియా ముస్లింలు పాల్గొన్నారు.


దస్తగిరి రెడ్డిని సన్మానిస్తున్న సహచర నాయకులు

ఎపిఎన్‌జిఒ రాష్ట్ర ప్రెసిడెంట్‌గా వి.దస్తగిరిరెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ గా వి. దస్తగిరి రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫిబ్రవరి 29వ తేదీన ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యాలయం విజయవాడలో జరిగిన సర్వసభ్యుల సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రస్తుత రాష్ట్ర కార్యవర్గంలో ఆయన ఉపాధ్యక్షులుగా పని చేస్తున్నారు. దస్తగిరి రెడ్డి అసోసియేషన్‌కు చేసిన సేవలకు గుర్తింపుగా ఆయనకు పదోన్నతి కల్పించి రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వి.దస్తగిరి రెడ్డి రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇక ముందు కూడా ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక, పెన్షన్ల సమస్యల పరిష్కారానికి తప్పక కృషి చేస్తానని తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షులు వి సి హెచ్ వెంగళ రెడ్డి మాట్లాడుతూ దస్తగిరి రెడ్డిని రాష్ట్ర సహాధ్యక్షులుగా ఎనుకున్నందుకు రాష్ట్ర కార్య వర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. దస్తగిరి రెడ్డిని రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకోవడం జిల్లాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల అసోసియేషన్ ప్రెసిడెంట్ టీ. మణి శేఖర్ రెడ్డి, సెక్రటరీ బీసీ హుస్సేన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష వరం : సర్పంచి

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరంలాంటిదని, గ్రామీణ ప్రాంత ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పార్నపల్లి సర్పంచ్ షేక్ షబ్బీర్ అహ్మద్ తెలిపారు. శుక్రవారం మండలంలోని పార్లపల్లి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రత్యేక డాక్టర్ల ద్వారా నిర్వహించారు. గ్రామ ప్రజలకు బిపి, షుగర్, కంటి, రక్త పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించారు. అవసరమైన రోగులకు ఆరోగ్యశ్రీ ద్వారా మెరుగైన వైద్యం అందించేందుకు సంబంధిత ఆసుపత్రులకు రెఫర్ చేశారు. రోగులందరికీ ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించి సంపూర్ణ ఆరోగ్యంగా చేయాలనే లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ విజయ రావు, శ్రీనివాసులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు భావన, రంజిత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

3న పల్స్ పోలియో

ప్రజాశక్తి - పగిడ్యాల

ఈ నెల 3న నిర్వహించే పోలియో కార్యక్రమాన్ని విజయ వంతం చేద్దామని పగిడ్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డాక్టర్ మోహన్ తెలిపారు. మండల పరిధిలో 2816 మంది ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. 26 కేంద్రా లలో 104 మంది వైద్య సిబ్బంది పాల్గొంటారని చెప్పారు.

జడ్పి పాఠశాల హెచ్ఎం సస్పెండ్

ప్రజాశక్తి - బనగానపల్లె

బనగానపల్లె పట్టణంలోని కొండపేట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు జానకిని కడప ఆర్జెడి రాఘవరెడ్డి సస్పెండ్ చేసినట్లు ఎంఈఓ స్వరూప తెలిపారు. శుక్రవారం పట్టణంలోని జిల్లా కొండపేట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల లో ప్రధానోపాధ్యాయురాలు జానకిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాల విద్యార్థులతో ప్రధానోపాధ్యాయురాలు సొంత ఇంటిలో పని చేస్తున్నట్లు వివిధ పత్రికల్లో ఛానల్లో వార్తలు రావడంతో స్పందించడం ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు.

ఆర్‌జిఎంలో సంకల్ప్- 2024 ప్రారంభం

ప్రజాశక్తి - పాణ్యం

మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో సంకల్ప్ 2024 సాంకేతిక సదస్సు ప్రారంభమైనట్లు సంకల్ప్ కన్వీనర్ డాక్టర్ తిరుపతిరెడ్డి తెలిపారు. శుక్రవారం కళాశాలలో ప్రారంభమైన సదస్సును ప్రిన్సిపల్ డాక్టర్ జయచంద్ర ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం నిర్వహించే ఈ కార్యక్రమంలో హైదరాబాదు ఇంటర్నేషనల్ నాన్ డిస్ట్రక్టివ్ అండ్ ఎవల్యూషన్, కంప్యూటర్ న్యూమరికల్ కంట్రోల్ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సాంకేతిక పత్రాల సమర్పణ, క్విజ్, వ్యాసరచన, డ్రాయింగ్, టెక్నాలజీ, తదితర అంశాలపై పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ జయచంద్ర ప్రసాద్, డాక్టర్ రామిరెడ్డి, కన్వీనర్ డాక్టర్ మనోజ్ పాంచాల్, విద్యార్థులు, మెకానికల్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్ర ప్రసాద్